ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



పెద్దపల్లి

జిల్లా వార్తలు

5★ శనివారం 20 ఏప్రిల్ 2024

సోషల్ వెల్ఫేర్ బాలుర హాస్టల్‌లో విద్యార్థులకు అస్వస్థత 7లో..

కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలపై పోరాటం 8లో..

సింగరేణి 'విద్యుత్'కు డిమాండ్



- సంస్థ ముంగిట కొత్తగా విద్యుత్ ప్లాంట్ల ఏర్పాటు ప్రతిపాదనలు
- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి 800/2 యూనిట్లకు ఒత్తిడి

గోదావరిఖని, ఏప్రిల్ 19: బొగ్గు ఉత్పత్తి సంస్థ అయిన సింగరేణి జైపూర్ విద్యుత్ ప్లాంట్‌తో విద్యుత్ ఉత్పత్తి రంగంలోకి కూడా విస్తరించింది. దీంతో సింగరేణి సంస్థ ద్వారా విద్యుత్ ఉత్పత్తిని పెంచాలనే ఆలోచనకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వచ్చాయి. దేశవ్యాప్తంగా క్రమంగా విద్యుత్ డిమాండ్ పెరగడంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్‌టీపీసీ, జెన్‌కో లాంటి విద్యుత్ సంస్థలను నిర్వహిస్తున్నప్పటికీ విద్యుత్ రంగంలో మంచి ఫలితాలు సాధిస్తున్న సింగరేణిపై ఒత్తిడి పెంచే ప్రయత్నాలు చేస్తున్నాయి. రాష్ట్రంలో ప్రస్తుతం 15వేల మెగావాట్ల విద్యుత్ డిమాండ్ కొనసాగుతున్నది. అత్యవసర పరిస్థితుల్లో రాష్ట్ర ప్రభుత్వం కూడా ఇతర రాష్ట్రాల నుంచి విద్యుత్ కొనుగోలు చేస్తున్నది. అయితే మరో ఐదేళ్లలో అంటే 2029 వరకు రాష్ట్రంలో 27వేల మెగావాట్ల విద్యుత్ డిమాండ్ ఉంటుందని అంచనా వేస్తున్నారు. ఈ డిమాండ్‌కు అనుగుణంగా విద్యుత్ ఉత్పత్తి పెంచే యోచనలో రాష్ట్ర ప్రభుత్వం ఉన్నది. దేశవ్యాప్తంగా కూడా గత సంవత్సరం వరకు ఒకరోజు 175మెగావాట్ల నుంచి 200మెగవాట్ల విద్యుత్ అవసరాలు ఉంటే, ఈ సంవత్సరం అత్యధికంగా రోజుకు 247మెగావాట్ల విద్యుత్ అవసరాలు నమోదు అయ్యాయి. దీంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు భవిష్యత్ విద్యుత్ అవసరాలను దృష్టిలో పెట్టుకుని ముందస్తుగా ఎక్కడికక్కడ విద్యుత్ ఉత్పత్తిపై దృష్టి సారించాయి. ఈ ఒత్తిడి సింగరేణిపై పడింది. ఇప్పటికే జైపూర్ ప్లాంట్‌లో సింగరేణి సంస్థ 600/2 యూనిట్లతో 12మెగావాట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేస్తున్నది. సాంకేతిక పరిజ్ఞానం పెరుగుతున్న క్రమంలో సూపర్ క్రిటికల్ పవర్ స్టేషన్లు వస్తున్నాయి. అంటే విద్యుత్ ఉత్పత్తి 680మెగావాట్లకు పైబడిన విద్యుత్ ప్లాంట్లను మాత్రమే ప్రతిపాదిస్తున్నారు. ఈ నేపథ్యంలో సింగరేణి సంస్థ ఇప్పటికే జైపూర్‌లో 3వ యూనిట్‌గా మరో 800మెగావాట్ల ఉత్పత్తికి అన్ని అనుమతులు తీసుకుని టెండర్ ప్రక్రియను కూడా పూర్తి చేసింది. రాష్ట్ర ప్రభుత్వంతో పీపీఏకు సింగరేణి ప్రతిపాదనలు సమర్పించింది. అలాగే కేంద్ర బొగ్గు మంత్రిత్వ శాఖ కార్యదర్శి నుంచి జైపూర్‌లో 800మెగావాట్ల 4వ యూనిట్ నిర్మాణాన్ని చేపట్టాలని సింగరేణి సంస్థకు ఈ మధ్యనే సూచన చేసింది. ఈ అంశంపై సింగరేణి యాజమాన్యం పరిశీలన చేస్తున్నది. ఇదిలా ఉండగా రామగుండంలో జెన్‌కో ద్వారా 800మెగావాట్ల విద్యుత్ ప్లాంట్ కోసం ప్రభుత్వం ముందు ప్రతిపాదన ఉన్నది. రామగుండం ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్ ఒత్తిడితో రాష్ట్ర ప్రభుత్వం రామగుండంలో 800మెగావాట్ల విద్యుత్ ప్లాంట్‌ను ఏర్పాటు చేయాలనే సంకల్పానికి వచ్చింది. అయితే ఈ విద్యుత్ ప్లాంట్ జెన్‌కో ద్వారా ఏర్పాటు చేయాల్సి ఉండగా, ప్రభుత్వం ఈ ప్లాంట్‌ను కూడా సింగరేణి ద్వారా ఏర్పాటు చేయాలని యోచనకు వచ్చినట్టు సమాచారం. ప్రభుత్వం నుంచి అనధికారికంగా సింగరేణి ముందుకు ఈ ప్రతిపాదన వెళ్లింది. ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఇప్పటికే సింగరేణికి ఈ మేరకు ప్రతిపాదనలు చేయాలని సూచించినట్టు సమాచారం. దీంతో సింగరేణి ముందు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి 1600మెగావాట్ల కొత్త విద్యుత్ ప్లాంట్ల ఏర్పాటు ప్రతిపాదనలు ఉన్నాయి.

● కలిసివచ్చే అంశాలు ఎక్కువ..

ఒక మెగావాట్ విద్యుత్ ఉత్పత్తి ప్లాంట్ నిర్మాణానికి సుమారు రూ.9కోట్ల ఖర్చు కానుండగా, 800మెగావాట్ల విద్యుత్ యూనిట్ ఏర్పాటుకు రూ.7వేల కోట్లు అవసరం ఉంటుంది. విద్యుత్ ప్లాంట్ నిర్మాణం ప్రారంభమయ్యాక నాలుగు సంవత్సరాల్లో ఆ యూనిట్ నుంచి విద్యుత్ ఉత్పత్తి అవుతుంది. అంటే రూ.7వేల కోట్ల ఖర్చును నాలుగేళ్లలో సింగరేణి వెచ్చించాల్సి ఉంటుంది. ఇలా రెండు యూనిట్లు 800మెగావాట్లవి నిర్మాణం చేయాల్సి ఉంటే సింగరేణి సంస్థ మరో నాలుగేళ్లలో రూ.15వేల కోట్ల బడ్జెట్‌ను వెచ్చించేందుకు సన్నద్ధం కావాల్సి ఉంటుంది. ఇప్పటికైతే టెండర్ ప్రక్రియలో ఉన్న జైపూర్ 3 యూనిట్‌కు రూ.7వేల కోసం సింగరేణి వెచ్చించాల్సిన అవసరం ఉంటుంది. అయితే బడ్జెట్ విషయంలో జైపూర్ స్టేషన్‌లో ప్లాంట్ల ఏర్పాటుకు ఎలాంటి సమస్య గానీ, కొరత గానీ లేదని సింగరేణి వర్గాలు చెబుతున్నాయి. ఇప్పటికే 1200మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి చేస్తున్న సింగరేణి ఈ విద్యుత్ ప్లాంట్ల నిర్మాణానికి సిద్ధమైతే బొగ్గుతో పాటు సింగరేణి సంస్థ విద్యుత్ రంగంలో కూడా ప్రధాన పాత్ర పోషించే స్థాయికి ఎదుగుతుంది. విద్యుత్ ఉత్పత్తిలో జెన్‌కో లాంటి ఇతర విద్యుత్ ఉత్పత్తి సంస్థల కంటే సింగరేణికి కొన్ని అదనపు సానుకూలతలు ఉన్నాయి. గోదవారినది పక్కనే ఉన్న జైపూర్ ప్లాంట్‌కు నీటి సౌలభ్యత పుష్కలంగా ఉంది. దీనికి తోడు ప్లాంట్‌కు నీరు తరలించే వ్యవస్థ కూడా నిర్మించబడి ఉన్నది. మరో ముడిసరుకు అయిన బొగ్గును సింగరేణియే ఉత్పత్తి చేస్తుంది కనుక ఎలాంటి ఇబ్బంది ఉండదు. పైగా శ్రీరాంపూర్, బెల్లంపల్లి ప్రాంతాల్లో ఉత్పత్తి అవుతున్న బొగ్గు సరఫరాకు కూడా ఖర్చు తగ్గుతుంది. ఇప్పటికే జైపూర్ ప్లాంట్‌కు రైల్వే మార్గాలు కూడా ఏర్పాటు చేయబడి ఉన్నాయి. రామగుండంలో ప్లాంట్ ఏర్పాటు చేస్తే కూడా సింగరేణి సంస్థకు ఇతరుల కంటే ఎన్నో కలిసివచ్చే భౌగోళిక అంశాలు ఉన్నాయి. దీంతో పాటు రాష్ట్ర ప్రభుత్వంపై కూడా భారం పడకుండా జెన్‌కోకు సంబంధించిన 570ఎకరాల భూములు కూడా అందుబాటు లోనే ఉన్నాయి.

ఇదిలా ఉండగా సింగరేణి సంస్థ థర్మల్ విద్యుత్ కాకుండా ఇప్పటికే సోలార్ రంగంలో అడుగుపెట్టింది. మొదటి ఫేస్ కింద 350మెగావాట్ల సోలార్ ప్లాంట్‌ను ఏర్పాటుచేసి విద్యుత్ ఉత్పత్తి చేస్తున్నది. ఫేస్-2 కింద మరో 232మెగావాట్ల ఉత్పత్తికి కార్యాచరణ చేపట్టింది. రాష్ట్ర ప్రభుత్వ సూచన మేరకు మానేరుపై కూడా 300మెగావాట్ల సోలార్ ప్లాంట్ ఏర్పాటు కూడా సానుకూలత వ్యక్తం చేసి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నది. మొత్తంగా సింగరేణి ముందు 800/2మెగావాట్ల విద్యుత్ ప్లాంట్ల ఏర్పాటుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి ప్రతిపాదనలు ఉన్నాయి.

జబల్‌పూర్-మధురై ప్రత్యేక రైలుకు పెద్దపల్లిలో హాల్టింగ్ సౌకర్యం

పెద్దపల్లి, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): జబల్‌పూర్ నుంచి మధురై వరకు నడుస్తున్న వీక్లీ ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ నూతన రైలుకు పెద్దపల్లి రైల్వేస్టేషన్ జంక్షన్‌లో హాల్టింగ్ సౌకర్యం కల్పించారు. ఈ మేరకు దక్షిణ మధ్య రైల్వే అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ రైలు ఈనెల 18 నుంచి 25 వరకు జబల్‌పూర్ నుంచి మధురై వరకు, ఈనెల 20నుంచి 27వ తేదీ వరకు మధురై నుంచి జబల్‌పూర్ వరకు నడవనున్నది. మొత్తం 22 రైల్వేస్టేషన్లలో ఈ రైలుకు హాల్టింగ్ సౌకర్యం కల్పించగా అందులో తెలంగాణలో బెల్లంపల్లి, పెద్దపల్లి జంక్షన్, వరంగల్, ఖమ్మం స్టేషన్లలో ఆగనున్నది. ఈ రైలు జబల్‌పూర్ నుంచి మదురైకి వెళ్లేటప్పుడు పెద్దపల్లి జంక్షన్‌కు ప్రతి శుక్రవారం ఉదయం 3:50 గంటలకు రానున్నది. మధురై నుంచి జబల్‌పూర్‌కు వెళ్లేటప్పుడు ప్రతి ఆదివారం రాత్రి 7:40 గంటలకు రానున్నదని దక్షిణ మధ్య రైల్వే అధికారులు పేర్కొన్నారు. ఈ రైలు వల్ల మదురై మీనాక్షి అమ్మవారిని, తిరుచురాపల్లి దగ్గరలోని శ్రీరంగం దివ్య క్షేత్రంను దర్శించుకునేందుకు వెళ్లేందుకు సౌకర్యంగా ఉంటుంది.

ఎన్నికల సందేహాల నివృత్తి, ఫిర్యాదుల నమోదుకు కంట్రోల్ రూం

పెద్దపల్లిటౌన్, ఏప్రిల్ 19: ఎన్నికల సందేహాల నివృత్తికి, ఫిర్యాదులు నమోదు చేయడానికి 24 గంటల కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు పెద్దపల్లి సహాయ ఎన్నికల అధికారి బి.గంగయ్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గం ఎన్నికల నోటిఫికేషన్ విడుదలైన నేపథ్యంలో పెద్దపల్లి అసెంబ్లీ సెగ్మెంట్ పరిధిలో రెవెన్యూ డివిజన్ అధికారి కార్యాలయంలో సందేహాల నివృత్తికి, ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఉల్లంఘనలకు సంబంధించిన ఫిర్యాదులు నమోదు చేయడానికి కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. ఇది ఎన్నికల ప్రక్రియ ముగిసేవరకు ప్రతిరోజు 24గంటల పాటు అందుబాటులో ఉంటుందని, ఎన్నికల నిర్వహణపై సందేహాలు, ఫిర్యాదుల నమోదుకు కంట్రోల్ రూమ్ నెంబర్ 9398993638 నందు సంప్రదించాలని పేర్కొన్నారు.

పల్లె ప్రకృతి వనాలను పరిశీలించిన డీఎల్‌పీవో



పల్లె ప్రకృతి వనాన్ని పరిశీలిస్తున్న డీఎల్‌పీవో వేణుగోపాల్

ముత్తారం, ఏప్రిల్ 19: మండలంలోని ఖమ్మంపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని పల్లె ప్రకృతి వనాన్ని డీఎల్‌పీవో వేణుగోపాల్ శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పల్లె ప్రకృతి వనాలకు నీరు లేక మొక్కలు ఎండిపోతున్నాయని, గ్రామాల్లోని ఇన్చార్జులు ఏం చేస్తున్నారని అధికారులపై మండిపడ్డారు. తాగునీటి ఎద్దడి మొక్కలను కాపాడుకునేందుకు గ్రామపంచాయతీలకు ప్రత్యేక అధికారులను ఏర్పాటు చేయగా, వారి పనితీరు బాగాలేదని మండిపడ్డారు. మొక్కలు పూర్తిగా ఎండిపోయిన పరిస్థితుల్లో ఉండగా వాటిని చూసి అధికారులను మందలించారు. వెంటనే అన్ని గ్రామాల్లో పల్లె ప్రకృతి వనాలను ట్యాంకర్ల ద్వారా నీటిని ఏర్పాటు చేసి మొక్కలకు పచ్చదనాన్ని తీసుకురావాలని ఆయన అన్నారు. అలాగే గ్రామాల్లో నీటి ఎద్దడి లేకుండా పంచాయతీ కార్యదర్శులు చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో లలిత ఎంపీవో వేణుమాధవ్, పంచాయతీ కార్యదర్శి రాకేష్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీలో చేరికలు

ఎలిగేడు, ఏప్రిల్ 19 : మండంలోని శివపల్లి గ్రామంలోని ఎమ్మెల్యే చింతకుంట విజయరమణరావు నివాసంలో శుక్రవారం ఓదెల మండలం పొత్కపల్లి గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు, మాజీ సర్పంచ్‌లు దాసరి రాజన్న తదితరులు కాంగ్రెస్‌పార్టీలో చేరారు. గడ్డం లక్ష్మిమొండయ్య, చిక్కుడు రాజయ్య, పిట్టల అంజయ్య, శిలువేరి రాజేందర్, అక్కల సుధాకర్, రెడ్డి జంపయ్య, రెడ్డి శంకర్, పల్లెకుమార్, పిట్టల రాములు, పిట్టల సదానందం, పిట్టల రాములకు కండువా కప్పి కాంగ్రెస్ పార్టీలో చేరారు. కార్యక్రమంలో ఓదెల మాజీ వైస్ ఎంపీపీ అంబాల కొమురయ్య, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు బండారి రాము, ఖలీం, సాయి పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించిన డీసీవో



రైతులకు హమాలీలకు మజ్జిక పాకెట్లను పంపిణీ చేస్తున్న డీసీవో శ్రీమాల

సుల్తానాబాద్, ఏప్రిల్ 19: జిల్లాలో సహకార శాఖ అధ్వర్యంలో సింగిల్ విండోల నిర్వహణలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను శుక్రవారం జిల్లా సహకార శాఖ అధికారి శ్రీమాల పరిశీలించారు. మండలంలోని చిన్నకలువల సహకారం సంఘం అధ్వర్యంలో ఏర్పాటు చేసిన పలు కేంద్రాలను ఆమె పరిశీలించి అక్కడి నిర్వాహకులకు పలు సలహాలు సూచనలు అందజేశారు. ముఖ్యంగా ఎండలు మండిపోతున్న నేపథ్యంలో మధ్యాహ్నం తరువాత ఎండలో రైతులు ఎవరూ ఉండకుండా చూడాలన్నారు. ఎండకు తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కేంద్రాలకు వచ్చిన దాన్యం నిబంధనల మేరకు ఉండగానే వాటిని వెంట వెంటనే కాంటా వేయించాలని కేటాయించిన సమీప మిల్లులకు తరలించాలని సూచించారు. కొనుగోళ్ల ప్రక్రియను, దాన్యం తరలింపు ప్రక్రియను ఎక్కువగా ఉదయం సాయంత్రం వేళల్లో పూర్తి చేసుకోవాలని అన్నారు. ఆయా కేంద్రాలలో రైతులకు హమాలీలకు డీసీఓ మజ్జిక పాకెట్లను అంజేశారు. ఈ కార్యక్రమంలో సీఈఓ వల్లంకొండ రమేష్, సూపరింటెండ్ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

పంట కోత ప్రయోగాల ద్వారా దిగుబడి అంచనా

- ముఖ్య ప్రణాళిక అధికారి రవీందర్



రచ్చపల్లిలో తేమ శాతాన్ని పరిశీలిస్తుస్తున్న ఉపసంచాలకులు మోహన్‌రెడ్డి

ధర్మారం, ఏప్రిల్ 19: పంట కోత ప్రయోగాల ద్వారా దిగుబడి అంచనా వేయనున్నట్టు జిల్లా ముఖ్యప్రణాళిక అధికారి జి. రవీందర్ తెలియజేశారు. శుక్రవారం మండలంలోని రచ్చపల్లిలో లక్ష్మయ్య అనే రైతు పొలంలో డైరెక్టర్ ఆఫ్ ఎకానమిక్స్ అండ్ స్టాటిస్టిక్స్ ఉపసంచాలకులు మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో వరి పంట కోత ప్రయోగాలను నిర్వహించారు. లక్ష్మయ్య పంట పొలంలో ఎంపిక చేసిన భూభాగంలో వరి పంటను 5మీటర్ల పొడవు, 5మీటర్ల వెడల్పుతో నంట కోత ప్రయోగం నిర్వహించారు. ఇందులో 24కిలోల 250 గ్రాముల దిగుబడి వచ్చిందని ఆయన వివరించారు. అనంతరం గ్రామంలో ఐకేపీ వరి ధాన్యం కొనుగోలు కేంద్రంను ఉపసంచాలకులు మోహన్‌నెడ్డి పరిశీలించారు. ధాన్యంలో తేమ శాతాన్ని ఆయన పరిశీలించారు. తదనంతరం కలెక్టరేట్‌లో ఉన్న ఆటోమెటిక్ వెదర్ స్టేషన్‌ను పరిశీలించారు. ఉపగణాంక అధికారులు, మండలస్థాయి గణాంక అధికారులతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. అన్ని పంట కోత ప్రయోగాలు సూపర్విజన్ చేయాలన్నారు. ఇందులో వెరైటీలు, ధరలు అడిగి తెలుసుకోవాలని సూచించారు. అంతేకాకుండా ధాన్యం వినియోగం ఏ విధంగా జరిగిందో తెలుసుకోవాలని, యాన్యువల్ సర్వే ఆఫ్ ఇండియా ఇండస్ట్రీస్‌కు సంబంధించిన సర్వే ప్రగతి నివేదికలను పూర్తిచేయాలని ఆదేశించారు. ఉప గణాంక అధికారులు శ్యాంసుందర్, నగేష్, లింగారెడ్డి, వెంకటేశ్వర్లు గురువయ్య, షబానా, మండల ప్రణాళిక స్టాటిస్టిక్స్ అధికారులు ఉన్నారు.

నీరుకుల్లలో వైభవంగా గరుడ సేవ

సుల్తానాబాద్, ఏప్రిల్ 19: నీరుకుళ్లలోని శ్రీ భూనీళా సమేత రంగనాయక స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం రాత్రి గరుడ సేవ వైభవంగా నిర్వహించారు. కల్యాణంతో ప్రారంభమైన ఈ బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆలయ మాఢ వీధుల గుండా రోజుకు ఒక వాహన సేవ చొప్పున పురస్వాడు సేవ ఊరేగింపు శోభాయాత్ర నిర్వహిస్తారు. శుక్రవారం రాత్రి జరిగిన గరుడ సేవలో స్వామి వారు అమ్మవారితో పాటు గరుడ వాహనం మీద మాఢ వీధులలో విహరించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ విజేందర్, పెరుమారెడ్డి, సత్యనారయాణరెడ్డి, దామోదరరావు, భక్తులు పెద్దఎతున పాల్గొన్నారు.

మూడు నామినేషన్లు దాఖలు



నామినేషన్ దాఖలు చేస్తున్న కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం వంశీకృష్ణ



నామినేషన్ దాఖలు చేస్తున్న బీఆర్ఎస్ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్

పెద్దపల్లి, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గానికి రెండో రోజు అయిన శుక్రవారం ముగ్గురు అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థిగా మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ నామినేషన్ దాఖలు చేయగా, ఆయన వెంట పెద్దపల్లి, రామగుండం, బెల్లంపల్లి మాజీ ఎమ్మెల్యేలు దాసరి మనోహర్‌రెడ్డి, కోరుకంటి చందర్, దుర్గం చిన్నయ్య, మల్లేశం యాదవ్ ఉన్నారు. పార్టీ నాయకులు, స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున కలెక్టర్ కార్యాలయం వరకు తరలి రాగా, వారందరినీ గేటు బయటే నిలిపివేశారు. అభ్యర్థి వెంట కేవలం నలుగురిని మాత్రమే పంపించారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా గడ్డం వంశీకృష్ణ రెండు సెట్లలో నామినేషన్లు దాఖలు చేశారు. మొదటి సెట్ ప్రభుత్వ విప్ ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మన్ కుమార్, పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు, మాజీ ఎమ్మెల్యే నల్లాల ఓదెలు, తదితరులతో కలిసి, మరొక సెట్ తన తండ్రి చెన్నూరు ఎమ్మెల్యే డాక్టర్ జి వివేక్, తల్లి, భార్యతో కలిసి నామినేషన్ దాఖలు చేశారు. బీఆర్ఎస్‌కు చెందిన కొంకటి లింగమూర్తి రెబల్ అభ్యర్థిగా నామినేషన్ పత్రాన్ని ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్‌కు అందజేశారు. దీంతో రెండు రోజులు ముగిసేసరికి మొత్తం ఏడుగురు అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. నామినేషన్ల దాఖలుకు ఇంకా ఆరు రోజుల సమయం ఉంది.

కౌన్సిలర్ ఇంట్లో పోలీసుల సోదాలు సరికాదు



విలేకరులతో మాట్లాడుతున్న కొప్పుల ఈశ్వర్

సుల్తానాబాద్, ఏప్రిల్ 19: సుల్తానాబాద్ పట్టణంలోని తొమ్మిద వార్డు కౌన్సిలర్, బీఆర్ఎస్‌కు చెందిన గొట్టం లక్ష్మి ఇంట్లో పోలీసులు తనిఖీల పేరిట చేసిన వేధింపులను ఖండిస్తున్నట్లు, ఈ ఘటనపై విచారణ జరిపించాలని మాజీ మంత్రి, పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గ బీఆర్ఎస్ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్ డిమాండ్ చేశారు. కౌన్సిలర్ ఇంట్లో పోలీసుల తనిఖీలను పురస్కరించుకుని ఈశ్వర్ శుక్రవారం వారి ఇంటికి వచ్చి కౌన్సిలర్ లక్ష్మితో పాటు వారి కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతు మహిళా కౌన్సిలర్ అనే విషయాన్ని పరిగణనలోకి తీసుకోకుండా పోలీసులు వ్యవహరించిన తీరును తాము మానవ హక్కుల కమిషన్‌కు ఫిర్యాదు చేస్తామన్నారు. ఈ సమావేశంలో రామగుండం మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్, గ్రంథాలయ సంస్థ మాజీ ఛైర్మన్ రఘువీర్ సింగ్, బీఆర్ఎస్ నాయకులు దాసరి ఉష, దాసరి ప్రశాంత్‌రెడ్డి తదితర నాయకులు పలువురు కార్యకర్తలు పాల్గొన్నారు.

ఓటు హక్కును ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలి



ప్రతిజ్ఞ చేయిస్తున్న మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్

కోల్‌సిటీ, ఏప్రిల్ 19: రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో ఓటు హక్కును తప్పనిసరిగా వినియోగించుకోవాలని రామగుండం నగరపాలక సంస్థ కమిషనర్ సీహెచ్ శ్రీకాంత్ కోరారు. శుక్రవారం గోదావరిఖని ప్రభుత్వ మెడికల్ కళాశాల, ఆర్ఎఫ్‌సీఎల్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన స్వీప్ అవగాహన సదస్సులకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎలాంటి ప్రలోభాలకు, ఒత్తిళ్లకు గురికాకుండా నిజాయితీగా ఓటు వేయాలని, మతం, వర్గం, కులం, జాతి, భాష వంటి ప్రలోభాలకు లోనుకావద్దని, విద్యార్థులు తమ తల్లిదండ్రులను ఓటు వేసే విధంగా చూడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నోడల్ అధికారి రవుఫ్‌ఖాన్, ఇండస్ట్రీ జనరల్ మేనేజర్ మధుసూధనాచారి పాల్గొన్నారు.

26 నుంచి హోటల్ మేనేజ్‌మెంట్ సెమిస్టర్ పరీక్షలు

గణేష్‌నగర్, ఏప్రిల్ 19: శాతవాహన యూనివర్సిటీ పరిధిలో హోటల్ మేనేజ్‌మెంట్ 2,6వ సెమిస్టర్ పరీక్షలు ఈనెల 26 నుంచి మే3 వరకు జరుగుతాయని పరీక్షలు నియంత్రణ అధికారి డాక్టర్ ఎస్‌వీ శ్రీరంగప్రసాద్ ప్రకటనలో తెలిపారు. ఈ పరీక్షలు మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు కొనసాగుతాయని పేర్కొన్నారు.

'ఉపాధి' కూలీలపై బండరాయి పడి ముగ్గురికి గాయాలు

సుల్తానాబాద్, ఏప్రిల్ 19: మండలంలోని సుద్దాలలో జరుగుతున్న ఉపాధి హామీ పథకం పనుల వద్ద శుక్రవారం ప్రమాదం జరిగింది. మట్టి తవ్వుతుండగా పైనుంచి పెద్ద బండరాయి పడడంతో ముగ్గురు మహిళా కూలీలకు గాయాలయ్యాయి. మరి కొందరు తృటిలో ప్రాణాలు కాపాడుకున్నారు. సుల్తానాబాద్ ఎంపీడీవో దివ్యదర్శన్‌రావు తెలిపిన వివరాల ప్రకారం సుద్దాలలోని పెద్దమ్మ కుంట వద్ద 160 మంది కూలీలు కొన్ని రోజులుగా పూడిక తీత పనులు చేస్తున్నారు. శుక్రవారం కూడా వారు పని చేస్తుండగా పై నుంచి పెద్ద బండరాయి కూలీలపై పడింది. బుర్ర స్వరూప, కలువల లింగమ్మ, తార అనే ముగ్గురు మహిళలు గాయపడ్డారు. వెంటనే వీరిని ఉపాధిహామీ ఫీల్డ్ అసిస్టెంట్ సుల్తానాబాద్ అస్పత్రికి తరలించారు. అనంతరం ముగ్గురిని ఎంపీడీవో కరీంనగర్ అస్పత్రికి తరలించి మెరుగైన చికిత్స అందించారు. వీరిలో తార, లింగమ్మ లకు మామూలు గాయాలు కాగా బుర్ర స్వరూపకు నడుముకు గాయం కావడంతో అమెకు ప్రత్యేక చికిత్స అందిస్తున్నారు. ఎవరికీ ప్రాణాపాయం లేదని డాక్టర్లు చెప్పారని తెలిపారు. సంఘటనపై విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకుంటామని ఎంపీడీవో అన్నారు. అస్పత్రిలో చికిత్స పొందుతున్న వారిని కాంగ్రెస్ నాయకుడు మినుపాల ప్రకాష్‌రావు పరామర్శించారు.



అస్పత్రిలో చికిత్స పొందుతున్న కూలీలు

పిడుగు పడి రైతు కూలీకి తీవ్రగాయాలు

మెట్‌పల్లి రూరల్, ఏప్రిల్, 19: మండలంలోని ఆత్మకూర్ గ్రామానికి చెంది న కోరుట్ల రమేష్ అను రైతు కూలీ శుక్రవారం సాయంత్రం పడ్డ పిడుగు పాటుకు తీవ్రగాయాలపాలయ్యాడు. గ్రామంలోని కోరుట్ల రమేష్ వ్యవసాయ కూలీ పనులను చేసుకంటూ జీవనం కోనసాగిస్తున్నాడు. శుక్రవారం సాయం త్రం కూలీ పనులు ముగించుకోని ఇంటికి తిరిగి వస్తున్న క్రమంలో ఈదురు గాలులు, ఉరుములతో కూడి చినుకులు కురిసింది. చినుకులు పడుతుందని రోడ్డు పక్కన ఉన్న చెట్టు కింద నిలబడ్డాడు. అదే సమయంలో చెట్టుపై పిడుగు పడింది. చెట్టు పక్కకాడం ఊడిపోవడంతో రమేష్ కాలు, చెయికి తీవ్రగాయల పాలవడంతో పాటు పిడుగు పాటుకు ఆయన ఒంటి బలమైన గాయాలు తలిగినట్లు తెలిపారు. గమనించిన స్థానికులు చికిత్స కోసం మెట్‌ప ల్లి అనుపత్రికి తరలించారు. నిరుపేద కుటుంబానికి చెందిన రమేష్ కూలీ పనులు చేసుకుంటు జీవనం కొనసాగిస్తున్న అతనికి తీవ్రగాయల పాలైనం దుకు ప్రభుత్వం ఆదుకొని ఆర్థిక సహాయం అందించాలని ప్రజాప్రతినిధులు, నాయకులు, గ్రామస్థులు కోరుతున్నారు.

పిడుగుపాటుతో ఆవు మృతి

ఇల్లంతకుంట, ఏప్రిల్ 19: మండలంలోని జంగమరెడ్డిపల్లె గ్రామానికి చెం దిన పారిపెల్లి రాజిరెడ్డికి చెందిన ఆవు పిడుగుపాటుతో మృతిచెందింది. రాజు తన పాడి ఆవును శుక్రవారం వ్యవసాయ బావివద్ద కట్టివేసిరాగా సాయం త్రం పడిన పడిగుపాటుతో మృతిచెందింది. దీనితో తనకు రూ 80వేల నష్టం వాటిల్లిందని, ప్రభుత్వం ఆదుకోవాలని రాజిరెడ్డి విలపిస్తు కోరాడు.

విద్యుదాఘాతంతో గేదె..

కోరుట్ల రూరల్, ఏప్రిల్ 19: మండలంలోని సర్పరాజుపూర్ గ్రామంలో శుక్రవారం ఉదయం విద్యుత్ షాక్‌తో మృతి చెందినట్లు గ్రామస్థులు తెలిపారు. గ్రామానికి చెందిన కొక్కు గణేష్ తన గెదలను మోపడానికి గ్రామ శివారులోని వ్యవసాయ క్షేతంకు వెల్లినట్లు తెలిపారు. అక్కడ ఉన్న విద్యుత్ ట్రాన్ పార్మర్ వద్ద మోస్తుండంగా విద్యుత్ షాక్ తగిలి మృతి చెందినుట్ల గ్రామస్థులు తెలిపారు. కాగా యజమాని గణేష్ సుమార్ రూ. 50000 వరకు నష్టం వాటిలినట్లు బాదితుడు తెలిపాడు. బాదితుడిని ప్రభుత్వ పరంగా అదుకోవాలని గ్రామస్థులు కొరుతున్నారు.

పాముకాటుకు ఎద్దు..

రామగిరి, ఏప్రిల్ 19: మండలంలోని రాజాపూర్ గ్రామానికి చెందిన మాటేటి పర్వతాలు అనే రైతుకు చెందిన ఎద్దు శుక్రవారం పాటుకాటుకు గురై మృతి చెందింది. పొలం వద్ద గడ్డి మేస్తున్న తరుణంలో పాటుకాటుకు గురైంది. పశువైద్యాధికారి దుర్గాప్రసాద్‌కు సమాచారం అందించగా స్పందించి వైద్యం చేసినా అప్పటికే మృతిచెందింది. మృతిచెందిన ఎద్దు విలువ సుమారు 60 వెల వరకు ఉంటుంది.

ఆలయంలో చొరబడి ఫొటోలు, తులసి గద్దె విసిరివేత

● అన్యమతస్థుల పనేనని అనుమానం
● హనుమాన్ మాలధారుల ఆందోళన
● పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు
● విచారణ చేపట్టిన పోలీసులు





పొలంలో పడవేసిన వేంకటేశ్వర స్వామి చిత్రపటం, విచారణ జరుపుతున్న ఎస్సై ఉమా సాగర్

వెల్గటూర్, ఏప్రిల్ 19: మండలంలోని జగదేవ్‌పేట నగారా వెంకటేశ్వర స్వామి ఆలయంలో ఆకతాయిలు ఆగడం సృష్టించారు. ఆలయంలో ఉన్న వేంకటేశ్వర స్వామి, ఆంజనేయస్వామి చిత్రపటాలను, తులసి గద్దెను సమీపంలోని పొలంలో విసిరివేయడం కలకలం సృష్టించింది. వివరాలలోకి వెళ్లితే... జగదేవ్‌పేటలోని నగారా వేంకటేశ్వర స్వామి ఆలయంలో నిత్యం హనుమాన్ మాలధారులు ఆంజనేయస్వామి చిత్రపటాన్ని పెట్టుకొని పూజలు నిర్వహిస్తూ రాత్రి అక్కడే బస చేస్తున్నారు. ఈ క్రమంలో గురువారం లక్ష్మీపూర్ ఆలయానికి దర్శనార్థం వెళ్లారు. అదను చూసుకున్న కొందరు గుర్తుతెలియని వ్యక్తులు ఆలయంలోకి చొరబడి ఆలయంలోని వేంకటేశ్వర స్వామి, ఆంజనేయ చిత్రపటాలతో పాటు ఆలయం ముందు ఉన్న తులసి గద్దెను సమీపంలోని పొలంలో విసిరివేశారు. శుక్రవారం ఉదయం ఆలయానికి వచ్చిన హనుమాన్ మాలధారులు దేవుళ్ల చిత్రపటాలు పొలంలో పారవేయడం చూసి ఆందోళన చెందారు. ఆలయ చైర్మన్ కొర్రి గంగయ్యకు, మాజీ సర్పంచ్ లింగమ్మ రాజేశ్వర్‌రెడ్డి, మాజీ ఉపసర్పంచ్ తిరుపతిరెడ్డిలకు సమాచారం ఇచ్చారు. మాలధారులు, మరికొందరు కలిసి వెల్గటూర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఎస్సై ఉమాసాగర్ సిబ్బందితో కలిసి సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. క్లూస్ టీంకు సమాచారం ఇవ్వడంతో వారు వచ్చి వేలి ముద్రలు సేకరించారు. కాగా ఈ పని చేసింది అన్యమతస్థులేనని పలువురు అనుమానం వ్యక్తం చేశారు. ఈ సంఘటనకు పాల్పడిన వారిని గుర్తించి కఠినంగా శిక్షించాలని ఆలయ చైర్మన్ కొర్రి గంగయ్య, మాజీ సర్పంచ్ లింగమ్మ రాజేశ్వర్‌రెడ్డి, మాజీ ఉపసర్పంచ్ తిరుపతిరెడ్డి హనుమాన్ దీక్ష పరులు, గ్రామస్థులు డిమాండ్ చేశారు. ఈ మధ్యకాలంలో హిందూ దేవాలయాలు, హనుమాన్ దీక్ష పరులను అవమానించడం ఎక్కువగా జరుగుతోందని బీజేపీ నాయకుడు కొమ్ము రాంబాబు ఆందోళన వ్యక్తం చేశారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూడాలని పోలీసులను కోరారు. దుండగులను గుర్తించి కఠినంగా శిక్షించాలని లేని పక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని గ్రామస్తులు హెచ్చరించారు.

నీటి తొట్టిలో పడి బాలుడి మృతి

మేడిపల్లి, ఏప్రిల్ 19: మేడిపల్లి మండల కేంద్రంలో నీటి తొట్టిలో పడి బాలుడు శుక్రవారం మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం ఒరిస్సాకు చెందిన బైగని సాబర్ అనే మహిళ తన ఇద్దరు పిల్లలను తీసుకొని నాలుగు నెలల క్రితం స్థానికంగా ఉన్న ఇటుక బట్టిలో పనిలో చేరింది. గురువారం సాయంత్రం పిల్లలతో కలిసి పరమేష్(7) నీటి సంపు వద్ద స్నానానివెళ్లి ప్రమాదవశాత్తు తొట్టిలో పడిపోయాడు. గమనించిన కుటుంబసభ్యులు వెంటనే బయటకు తీసి జగిత్యాల ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే బాలుడు మృతి చెందినట్లు తెలిపారు. మృతుడి తండ్రి రెండేళ్ల క్రితమే మృతి చెందాడు. మృతుడి తల్లి బైగని సాబర్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని హెడ్‌కానిస్టేబుల్ ఇలియాజ్ అహ్మద్ తెలిపారు.

వాహనం అదుపు తప్పి వ్యక్తి తీవ్ర గాయాలు

ఎల్లారెడ్డిపేట, ఏప్రిల్ 19: ఎల్లారెడ్డిపేట మండలం రాగట్లపల్లి గ్రామ శివారులోని వంతెనపై శుక్రవారం ద్విచక్రవాహనం అదుపు తప్పి మండలంలోని పదిర గ్రామానికి చెందిన వ్యక్తి రెక్కల బుచ్చిరెడ్డి తీవ్ర గాయాల పాలయ్యాడు. క్షతగాత్రుడిని మండల కేంద్రంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. పదిరలోని వ్యక్తి బుచ్చిరెడ్డి తన ద్విచక్రవాహనంపై ఎల్లారెడ్డిపేటకు వెళ్లి తిరుగు ప్రయాణంలో వాహనం అదుపు తప్పి ప్రమాదానికి గురయ్యాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నామని పోలీసులు వివరించారు.

బావిలో దూకి వృద్ధురాలి ఆత్మహత్య

ఓదెల, ఏప్రిల్ 19: మండల కేంద్రానికి చెందిన చింతం లక్ష్మి(74) అనే వృద్ధురాలు శుక్రవారం వ్యవసాయ బావిలో దూకి ఆత్మహత్యకు పాల్పడింది. లక్ష్మి కొద్ది రోజుల నుంచి అనారోగ్యంతో బాధపడుతోంది. ఎన్ని ఆసుపత్రులు తిరిగిన నయం కాకపోవడంతో మానసిక వేదనకు గురవుతోంది. మళ్లీ డాక్టర్ల చుట్టూ తిరగలేక, బ్రతుకు మీద విరక్తిచెంది ఆత్మహత్య చేసుకుందని పేర్కొన్నారు. మృతురాలి కుమారుడు రమేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని పొత్కపల్లి ఎస్సై అశోక్‌రెడ్డి తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం

కరీంనగర్ క్రైం, ఏప్రిల్19: కొత్తపల్లి మండలం చింతకుంటలోని శాంతినగర్ వద్ద కరీంనగర్-వేములవాడ రోడ్డుపై శుక్రవారం ఉదయం రెండు బైక్‌లు ఢీకొన్న ప్రమాదంలో శాంతినగర్‌కు చెందిన యువకుడు ఠాక్ విశాల్(19) దుర్మరణం చెందాడు. మరొకరికి గాయాలయ్యాయి. కొత్తపల్లి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం విశాల్ తన బైక్‌పై కమాన్‌పూర్‌లోని బంక్‌లో పెట్రోల్ నింపుకుని తిరిగి శాంతినగర్‌కు వస్తున్న సమయంలో కరీంనగర్ నుంచి వేములవాడ వైపు అతివేగంగా బైక్‌పై వెళ్తున్న భూమి రాకేష్ ఢీకొట్టాడు. దీంతో విశాల్‌కు తీవ్రగాయాలు కాగా అతన్ని కుటుంబ సభ్యులు వెంటనే 108 అంబులెన్స్‌లో కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తుండగా మృతి చెందాడు. ప్రమాదంలో రాకేష్‌కు కూడా గాయాలు కాగా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నట్లు పోలీసులు తెలిపారు. మృతుడి తల్లి కవిత ఫిర్యాదుతో కేసు విచారణ జరుపుతున్నామని పోలీసులు తెలిపారు.

హుజూరాబాద్ డిపోలో ఆరుగురిపై బదిలీ వేటు

హుజూరాబాద్, ఏప్రిల్ 19: హుజూరాబాద్ ఆర్టీసీ డిపో కార్యాలయంలో పనిచేసే ఆరుగురి ఉద్యోగులపై శుక్రవారం వేటు పడింది. ఈ మేరకు ఆర్ఎం సుచరిత, డిప్యూటీ ఆర్ఎం సురికొంటి భూపతిరెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. నాలుగు రోజుల క్రితం హుజూరాబాద్ డిపో మేనేజర్ శ్రీకాంత్20వేల రూపాయలు లంచం తీసుకుం టూ ఏసీబీ అధికారులకు పట్టుబడిన విషయం విధితమే. దీనికి స్పందించిన ఆర్టీసీ ఎండీ సజ్జనార్ డిపో మేనేజర్ శ్రీకాంత్‌ను సస్పెండ్ చేశారు. హుజూరాబాద్ డిపో కార్యా లయంలో పనిచేసే కొంత మంది సిబ్బంది శ్రీకాంత్‌కు సన్నిహితంగా ఉన్నారని ఆర్టీసీ విజిలెన్స్ ఎంక్వైరీ అధికా రులు ఇచ్చిన నివేదిక మేరకు ఆరుగురిని కరీంనగర్ ఆర్ ఎం కార్యాలయానికి బదిలీ చేశారు. బదిలీ అయిన వారి లో రాజమణి (డ్యూటీ చాటింగ్), వెంకటయ్య (బుకింగ్ క్లర్క్), సురేందర్ (సూపరింటెండెంట్), జాఫర్ (మెకానిక్ ఎల్వో), రవీందర్ (డ్రైవర్), శంకరపట్నం బస్టాండ్‌లో పనిచేసే స్వామిలను బదిలీ చేశారు. ఇదే డిపోలో మరో ఇద్దరిపై కూడా బదిలీ వేటు పడనున్నట్లు తెలిసింది.

తాటి చెట్లు దగ్ధం

తంగళ్లపల్లి, ఏప్రిల్ 19: తంగళ్లపల్లి మండలం తాడూరు శివారులో అగ్ని ప్రమాదంలో తాటి చెట్లు దగ్ధమయ్యాయి. గ్రామ శివారులోని ఎల్లమ్మ దేవాలయం సమీపంలో గీతకార్మికులు సుమారు 500 తాటి చెట్లను పది సంవత్సరాలుగా సంరక్షిస్తున్నారు. ఈ క్రమంలో శుక్రవారం ప్రమాద వశాత్తు నిప్పు అంటుకొని మంటలు చెలరేగడంతో సుమారు 300 తాటి చెట్లు దగ్ధం అయ్యాయి. అగ్ని మాపక సిబ్బంది చేరుకుని మంటలను ఆర్పివేశారు. సంఘటన స్థలాన్ని గౌడ సంఘం నాయకులు, మాజీ సర్పంచ్ గుర్రం రాజలింగంగౌడ్ పరిశీలించి నష్ట పరిహారం ఇవ్వాలని కోరారు. కాగా దగ్ధం అయిన చెట్లను కాంగ్రెస్ నాయకుడు పుర్మాణి లింగారెడ్డి, మీరాల శ్రీనివాస్‌యాదవ్ పరిశీలించి ప్రభుత్వం నుంచి ఆర్థిక సాయం అందేలా చూస్తామని హామీ ఇచ్చారు.

ద్విచక్రవాహనాలు చోరీ చేస్తున్న నిందితుడి అరెస్టు

సిరిసిల్ల క్రైం, ఏప్రిల్ 19: సిరిసిల్ల పట్టణంలోని వెంకంపేట వద్ద ద్విచక్రవాహనాలు చోరీ చేస్తున్న కామారెడ్డి జిల్లా మాచారెడ్డి మండలంలోని పరీద్‌పేటకు చెందిన కోల రవిగౌడ్ (46)ను శుక్రవారం అరెస్ట్ చేశామని టౌన్ సీఐ రఘుపతి తెలిపారు. ఇతను సిరిసిల్ల పట్టణంలోని సినారె గ్రంథాలయం, దామిని బార్ ఎదుట పార్క్ చేసిన రెండు ద్విచక్రవాహనాలను చోరీచేసి ఒక వాహనాన్ని చెట్ల పొదల్లో దాచిపెట్టి మరో వాహనంపై తిరుగుతండగా పట్టుకున్నామని తెలిపారు. చోరీ చేసిన రెండు ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకొని దొంగను కోర్టులో హాజరుపరచామని ఆయన తెలిపారు.

ఎస్సీ, ఎస్టీ కేసుపై డీఎస్పీ విచారణ

వెల్గటూర్, ఏప్రిల్ 19: మండలంలోని కిషన్‌రావుపేటలో శుక్రవారం డీఎస్పీ రఘుచందర్ ఎస్సీ, ఎస్టీ కేసుపై విచారణ చేపట్టారు. కిషన్‌రావుపేటకు చెందిన మెరుగు కొమురయ్య అనే వ్యక్తి తనను కులం పేరుతో ధూషించాడని అదే గ్రామానికి చెందిన అన్నపూర్ణ అనే మహిళ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ నేపథ్యంలో పోలీసులు కొమురయ్యపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేశారు. ఈ క్రమంలో డీఎస్పీ రఘుచందర్ కిషన్‌రావుపేటలో విచారణ చేపట్టారు. సాక్షులను విచారించి వాంగ్మూలం నమోదు చేశారు. ఈ సందర్భంగా ఆయన వెంట ఎస్సై ఉమాసాగర్ ఉన్నారు.

కొండగట్టులో
నత్తనడకన చిన్న జయంతి ఏర్పాట్లు



ఏర్పాటు చేస్తున్న స్వాగత తోరణం

మల్యాల, ఏప్రిల్ 19: కొండగట్టు ఆంజనేయస్వామి సన్నిధిలో చిన్న జయంతి ఏర్పాట్లు నెమ్మదిగా జరుగుతున్నాయి. సోమవారం నుంచి మూడు రోజుల పాటు జరిగే జయంతి వేడుకలకు గాను ఇప్పటికే దాదాపుగా ఏర్పాట్లు పూర్తి కావాల్సి ఉండగా నత్తనడకన సాగుతున్నాయి. కొండపైన దీక్షపరులు, లడ్డూ ప్రసాదాల కోసం క్యూలైన్‌లు ఏర్పాటు కాగా మిగితా ఏర్పట్లు అంతంత మాత్రమే. విద్యుత్ లైట్స్, షైక్‌ల పనులు కావాల్సి ఉండగా చలివేంద్రాల ఏర్పాటు ఊసేలేదు. భక్తులు నడిచి వచ్చె ఘాట్‌రోడ్డు, మెట్ల మార్గంలో చేపట్టాల్సిన సౌకర్యాలు ప్రారంభించలేదు. జయంతికి సంబంధించిన ప్రచార ఫ్లెక్సీలు మాత్రం ఏర్పాటు చేశారు. లక్షలాదిగా తరలివచ్చె దీక్షపరులకు తగిన సౌకర్యాలను త్వరగా పూర్తిచేయాలని ఇటీవల కలెక్టర్ ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి అధికారులకు ఆదేశాలు జారీ చేయడమే కాకుండా అడిషనల్ కలెక్టర్ నేతృత్వంలో మరోసారి సమపన్వయ సమావేశం నిర్వహించినా ఏర్పాట్లలో వేగం కనిపించడం లేదని పలువురు పేర్కొంటున్నారు. ఇప్పటికైన సౌకర్యాలు, వసతుల కల్పనకు చర్యలు తీసుకోవాలని కోరుతన్నారు.



ఘాట్‌రోడ్డు వెంట లైట్లు ఏర్పాటు చేస్తున్న సిబ్బంది

స్కూల్ ఆటో బోల్తా

రామగిరి, ఏప్రిల్ 19: మండలంలోని రత్నాపూర్ గ్రామసమీపంలో కారు ఢీకొట్టిన ప్రమాదంలో స్కూల్ ఆటో బోల్తాపడింది. సెంటినరీకాలనీ నుంచి నాగే పల్లి వైపు టిఎస్22 టిఏ 2087 నంబరు గల ఆటోలో ప్రైవేట్ స్కూల్ విద్యా ర్థులను తరలిస్తుండగా ఎదురుగా వస్తున్న కారు ఢీకొట్టడంతో విద్యార్థులతో ఉన్న ఆటో పల్టీ కొట్టింది. దీంతో ఆటో డ్రైవర్ నరివెద్ది సంపత్‌కు ఎడమ కాలు ఫ్రాక్చర్ కాగా, విద్యార్థులకు గాయాలు కాలేదు.

డిగ్రీ సెమిస్టర్ పరీక్షలు ప్రారంభం

గణేశ్‌నగర్, ఏప్రిల్ 19: శాతవాహన విశ్వవిద్యాలయం పరిధిలో ఆరో సెమిస్టర్ పరీక్షలు శుక్రవారం ప్రారంభమైనట్లు శాతవాహన విశ్వవిద్యాలయం పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ ఎన్.వి.శ్రీరంగప్రసాద్ తెలిపారు. మొత్తం 16,557 మంది విద్యార్థులకు గాను 16,003 మంది విద్యార్థులు హాజరు కాగా 554మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. మాల్ ప్రాక్టీస్ కేసులు ఏమీ నమోదు కాలేదని ఆయన తెలిపారు.

పాలీసెట్ దరఖాస్తుకు 22 వరకు గడువు

కరీంనగర్ టౌన్, ఏప్రిల్ 19: పాలిటెక్నిక్ ప్రవేశ పరీక్ష (పాలీసెట్-24) రాసేందుకు దరఖాస్తు చేసుకునేందుకు ఈనెల 22వ తేదీ వరకు గడువు ఉందని, విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఆదర్శ ఆవాస మహిళా పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ ఓ ప్రకటనలో తెలిపారు. వివరాలకు కరీంనగర్ డాక్టర్ బీఆర్‌అంబేద్కర్ ఆదర్శ మహిళా రెసిడెన్షియల్ పాలిటెక్నిక్‌కళాశాలలో సంప్రదించాలని సూచించారు.

డ్రంకెన్ డ్రైవ్ కేసులో
ముగ్గురికి జైలుశిక్ష, జరిమానా

కరీంనగర్ క్రైం, ఏప్రిల్ 19: మోతాదుకు మించి అధికంగా మద్యం సేవించి పోలీసుల డ్రంకెన్ డ్రైవ్ తనిఖీల్లో పట్టుబడిన ముగ్గురు వాహనదారులకు కరీంనగర్ మున్సిఫ్ కోర్టు జడ్జి జైలుశిక్ష, జరిమానా విధిస్తూ తీర్పు వెలువరిం చారని కరీంనగర్ ట్రాఫిక్ సీఐ కరీం ఉల్లాఖాన్ తెలిపారు. డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడిన ఎనిమిది మందిని శుక్రవారం కోర్టులో హాజరుపరచగా అందులో ముగ్గురు వ్యక్తులకు మూడు రోజుల జైలుశిక్ష, మొత్తం 6,500 రూపాయల జరిమానా విధించారని తెలిపారు. మిగతా ఐదుగురు వ్యక్తులకు 10 వేల రూపాయల జరిమానా విధించినట్లు తెలిపారు.

కరీంనగర్‌లో రూ.15.81లక్షల నగదు సీజ్





కరీంనగర్‌లో సీజ్ చేసిన నగదును చూపిస్తున్న సీఐ సరిలాల్, వేములవాడలో నగదు స్వాధీనం చేసుకున్నట్టు పత్రాన్ని అందజేస్తున్న అధికారులు

కరీంనగర్ క్రైం, ఏప్రిల్ 19 : పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా శుక్రవారం కరీంనగర్‌లోని పలుచోట్ల శుక్రవారం నిర్వహించిన వాహన తనిఖీల్లో సరైన ఆధారాలు లేని 15 లక్షల 81 వేల 900 రూపాయల నగదును పోలీసులు పట్టుకున్నారు. కరీంనగర్ ఒకటో ఠాణా పరిధిలోని రాజీవ్ చౌక్ వద్ద కరీంనగర్ దుర్గమ్మగడ్డకు చెందిన జలగం సుమన్ వద్ద ఎలాంటి ఆధారాలు లేకుండా తీసుకువెళ్తున్న ఏడు లక్షల నగదును సీజ్ చేశారు. కరీంనగర్ రెండో ఠాణా పరిధిలోని ఇందిరా చౌక్ వద్ద మానకొండూర్‌కు చెందిన నెల్లి భాస్కర్(కపిల్ చిట్‌ఫండ్స్) వద్ద 1,11,900 రూపాయలు, ఐబీ చౌరస్తా వద్ద కరీంనగర్ కోతిరాంపూర్‌కు చెందిన కొల ప్రదీప్ కుమార్ వద్ద 5,70,000 రూపాయలు పట్టుకున్నట్లు పోలీసులు తెలిపారు. కరీంనగర్ మూడో ఠాణా పరిధిలో నిర్వహించిన తనిఖీల్లో కట్టారాంపూర్‌కు చెందిన గాండ్ల సురేష్‌వద్ద 2 లక్షల రూపాయలను స్వాధీన పరుచుకున్నట్లు పోలీసులు తెలిపారు. పట్టుబడిన మొత్తం నగదును తదుపరి సీజర్ కమిటీకి స్వాధీనం చేశామని సీఐలు సరిలాల్, విజయ్ కుమార్, జాన్‌రెడ్డిలు తెలిపారు.

● **వేములవాడలో 5.67 లక్షలు పట్టివేత..**

వేములవాడ: వేములవాడ పట్టణంలో తగిన పత్రాలు లేకుండా తీసుకువెళుతున్న ఐదు లక్షల 67 వేల రూపాయల నగదును ఎన్నికల ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు పట్టుకున్నారు. ఎన్నికల ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారి వెంకట్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం శుక్రవారం తనిఖీల సందర్భంగా నంద్యాడపు నర్సయ్య అనే వ్యక్తి వద్ద ఐదు లక్షల 67 వేల రూపాయలు పట్టుబడ్డాయని తెలిపారు. ఎలాంటి పత్రాలు లేకపోవడంతో నగదును సీజ్ చేసినట్టు తెలిపారు.

అప్పుల బాధతో అన్నదాత బలవన్మరణం



చిన్నమల్లయ్య (ఫైల్)

ఎల్లారెడ్డిపేట, ఏప్రిల్ 19: ఓ వైపు అప్పులు చేసి పంట సాగు చేస్తే తెగుళ్ల సోకి దిగుబడి రాదనే ఆందోళన.. మరో వైపు ఇంటి భవన నిర్మాణానికి తెచ్చిన బాకీలు తీర్చే మార్గం కానరాకపోవడంతో మనస్తాపం చెందిన అన్నదాత నెత్తెట్ల చిన్నమల్లయ్య(48) ఉరి వేసుకుని బలవన్మరణానికి ఒడిగట్టాడు. ఈ సంఘటన ఎల్లారెడ్డిపేట మండలం రాగట్లపల్లి గ్రామంలో శుక్రవారం విషాదం నింపింది. కుటుంబ సభ్యులు, పోలీసుల కథనం మేరకు.. గ్రామంలోని రైతు చిన్నమల్లయ్య తనకున్న మూడెకరాల వ్యవసాయ భూమిని యేడాది కిందట మూడు లక్షల రూపాయలు అప్పులు చేసి చదును చేశాడు. ప్రస్తుత యాసంగి సీజన్‌లో మరో రూ.1.50 లక్షలు అప్పు తీసుకువచ్చి వరి పంట వేశాడు. పంటకు తెగుళ్ల సోకి దిగుబడి తగ్గుతోందని ఆందోళన చెందాడు. ఇటీవల రూ. 10.50 లక్షలు అప్పులు చేసి ఇంటి భవన నిర్మాణాన్ని చేపట్టాడు. బాకీలు తీర్చే మార్గం లేకపోవడంతో మనస్తాపం చెందిన చిన్నమల్లయ్య ఈ నెల 18న రాత్రి ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. ఆందోళనకు గురైన కుటుంబసభ్యులు చుట్టు పక్కల, బంధువుల వద్ద ఆరా తీసినా ఆచూకీ లభించలేదు. శుక్రవారం గ్రామ శివారులో గొర్రెల కాపారులకు వ్యవసాయ పొలం సమీపంలోని ఓ చెట్టుకు ఉరివేసుకుని వ్యక్తి మృతదేహం కనిపించింది. సమాచారం అందుకున్న కుటుంబసభ్యులు అక్కడ చేరుకుని చిన్నమల్లయ్యదీగా గుర్తించారు. కుటుంబ పెద్ద మృతి చెందడంతో కన్నీరు మున్నీరుగా రోదించారు. మృతుడికి భార్య సత్తవ్వ, కొడుకు అజయ్, కూతురు అమూల్య ఉన్నారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని పోలీసులు వివరించారు.

స్కూల్ యూనిఫాంల తయారీలో నాణ్యత పాటించాలి

- సమగ్ర శిక్ష రాష్ట్ర ప్రాజెక్ట్ డైరెక్టర్ మల్లయ్యభట్టు



సిరిసిల్ల టెక్స్‌టైల్ పార్కులో క్లాత్ తయారీని పరిశీలిస్తున్న మల్లయ్యభట్టు

సిరిసిల్ల కలెక్టరేట్, ఏప్రిల్ 19: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు అందించే స్కూల్ యూనిఫాంల వస్త్రాలను నాణ్యతప్రమాణాలతో తయారు చేసి అందించాలని సమగ్ర శిక్ష రాష్ట్ర ప్రాజెక్ట్ డైరెక్టర్ మలయ్యభట్టు అధికారులకు సూచించారు. సిరిసిల్ల పట్టణంతో పాటు తంగళ్లపల్లి మండలం బద్దెనపల్లి టెక్స్‌టైల్ పార్కులో తయారవుతున్న ఆర్వీఎం వస్త్రాలతో పాటు చంద్రంపేటలోని గౌడ సైజింగ్‌లను శుక్రవారం సంబంధిత అధికారులతో కలిసి మల్లయ్యభట్టు సందర్శించి తయారుచేసిన వస్త్రాలతో పాటు తయారీ విధానాలను పరిశీలించారు. ఈ సందర్భంగా టెక్స్‌టైల్ పార్కులో తయారు చేస్తున్న స్కూల్ యూనిఫాం వస్త్రాల తయారీతో పాటు వాటిలో ఉండే నాణ్యతలను పరిశీలించి అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఏఎస్‌పీడీ రమేష్, జాయింట్ డైరెక్టర్ వెంకటనర్సమ్మ, రాష్ట్ర సీఎంవో జోసెఫ్, టెస్కో జనరల్ మేనేజర్ ఎల్ వెంకటేశ్వర్‌రావు, చేనేత జౌళిశాఖ ఆర్‌డీడీ అశోక్‌రావు, ఏడీ సాగర్, జిల్లా విద్యాధికారి రమేష్‌కుమార్, జెండర్, ఈక్విటీ కోఆర్డినేటర్ పద్మజ, ఈఈ అనిత తదితరులు పాల్గొన్నారు.



కస్తూర్బా పాఠశాలలో విద్యార్థులతో మాట్లాడుతున్న మలయ్యభట్టు

● **కస్తూర్బాగాంధీ పాఠశాలల తనిఖీ..**

సిరిసిల్ల పట్టణ శివారులోని పెద్దూర్‌లో ఉన్న కస్తూర్బాగాంధీ పాఠశాలతో పాటు తంగళ్లపల్లి మండలం పద్మనగర్‌లో ఉన్న కస్తూర్బా గాంధీ పాఠశాలలను శుక్రవారం సమగ్ర శిక్ష రాష్ట్ర ప్రాజెక్ట్ డైరెక్టర్ మల్లయ్యభట్టు ఆకస్మికంగా సందర్శించారు. ఈ పాఠశాలల్లో విద్యార్థుల కోసం తయారు చేస్తున్న భోజనాలను పరిశీలించడంతో పాటు మెనూ ప్రకారం భోజనం అందించడంతో పాటు వసతులను కల్పించి చూసుకోవాలని సూచించారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడి భోజనాలతో పాటు వసతులను అందిస్తున్నారనే విషయాన్ని అడిగి తెలుసుకున్నారు. సిరిసిల్ల పాఠశాలకు మంజూరైన అదనపు అకాడమిక్ బ్లాక్ నిర్మాణ పనులను పర్యవేక్షించారు. కార్యక్రమంలో ఏఎస్‌పీడీ రమేష్, జాయింట్ డైరెక్టర్ వెంకటనర్సమ్మ, రాష్ట్ర సీఎంవో జోసెప్, జిల్లా విద్యాధికారి రమేష్‌కుమార్, పద్మజ, పాఠశాల ప్రత్యేక అధికారి పావనిలు పాల్గొన్నారు.

మట్టి తరలిస్తున్న టిప్పర్ సీజ్

వేములవాడ టౌన్, ఏప్రిల్ 19: వేములవాడ మండలం అనుపురం ముంపు గ్రామంలో ఎలాంటి అనుమతులు లేకుండా మట్టి తరలిస్తున్న టిప్పరును స్వాధీనం చేసుకొని పోలీస్‌స్టేషన్ తరలించినట్లు రూరల్ తహసీల్దార్ సుజాత శుక్రవారం తెలిపారు. ఎలాంటి అనుమతులు లేకుండా ముంపు గ్రామాల పరిధిలోని గ్రామాల భూముల్లో అక్రమంగా మట్టి తరలిస్తున్నట్లు తమ దృష్టికి రావడంతో ఒక్క టిప్పర్‌ను సీజ్ చేశామన్నారు. అనుమతులు లేకుండా మట్టిని తరలిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఉద్యోగాలు ఇప్పిస్తానని
మోసం చేసిన వ్యక్తి అరెస్టు

ఇల్లంతకుంట, ఏప్రిల్ 19: మండలంలోని నలుగురు వ్యక్తులకు ఉద్యోగాలు ఇప్పిస్తానని మోసం చేసిన కరునాదం శివకృష్ణను శుక్రవారం అరెస్టు చేసినట్లు ఎస్సై రాజుగౌడ్ తెలిపారు. ఎస్సై వివరాల ప్రకారం నర్సక్కపేట గ్రామానికి చెందిన కొత్త లింగారెడ్డి, బొల్లం రాజు, తిప్పరవేణి చంద్రశేఖర్, ధర్మ శ్రీనివాస్‌కు పంచాయతీ కార్యదర్శి, వీఆర్వో ఉద్యోగాలు ఇప్పిస్తానని సిరిసిల్ల పట్టణానికి చెందిన శివకృష్ణ 2018లో రూ 6.50లక్షలు తీసుకున్నాడు. శివకృష్ణ వ్యవసాయశాఖలో అటెండర్‌గా పనిచేస్తుండటంతో నమ్మి డబ్బులు ఇచ్చామని 2013లో పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు హైద్రాబాద్‌లో ఉంటున్న నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై తెలిపారు. నిరుద్యోగులు ఎవరు ఉద్యోగాలు ఇప్పిస్తామంటే నమ్మి మోసపోవద్దని ఎస్సై సూచించారు.

సోషల్ వెల్ఫేర్ బాలుర హాస్టల్‌లో విద్యార్థులకు అస్వస్థత

- వాంతులు, విరేచనాలు, కడుపునొప్పి
- 25 మందికి ఆస్పత్రిలో చికిత్స



చికిత్స పొందుతున్న విద్యార్థులు



హాస్టల్‌లోని సిక్ రూమ్‌లో ఉన్న విద్యార్థులు

సుల్తానాబాద్, ఏప్రిల్ 19: సుల్తానాబాద్ పట్టణ శివారులో ఉన్న సాంఘీక సంక్షేమ శాఖ గురుకుల కళాశాల వసతి గృహంలో 25 మంది విద్యార్థులకు అస్వస్థకు గురయ్యారు. హాస్టల్‌లో మొత్తం విద్యార్థుల సంఖ్య 480 మంది కాగా, గురువారం 372 మంది విద్యార్థులు ఉన్నారు. వారిలో 20 మందికి వాంతులు, విరేచనాలు, కడుపునొప్పి మొదలైంది. హాస్టల్‌లో సిబ్బంది వారిని సుల్తానాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. శుక్రవారం మరో ఐదు మంది విద్యార్థులకు కూడా ఇదే విధంగా వాంతులు, విరేచనాలు కావడంతో వారిని కూడా ఆస్పత్రికిలో చేర్చారు. పరీక్షలు ఉండడంతో కొంతవరకు కొలుకున్న వారిని శుక్రవారం ఉదయం హాస్టల్‌కు తరలించారు. పరీక్షల తర్వాత వారిని హాస్టల్‌లోని ఒక ప్రత్యేక గదిలో ఉంచి శుక్రవారం రాత్రి డాక్టర్ల సూచనల మేరకు కేవలం పెరగన్నం మాత్రమే అందించారు. గురువారం సాయంత్రం బొండాలు పెట్టారని, అవి తినలేని పరిస్థితిలో ఉన్నాయని, ఈ విషయం హాస్టల్ ఇన్‌చార్జి దృష్టికి తీసుకువెళ్లినా పట్టించుకోలేదని, కొందరు వాటిని పడవేశారని, తిన్న తమకు వాంతులు, విరేచనాలు, విపరీతమైన కడుపునొప్పితో బాధపడుతున్నామని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేశారు.

● **రీజనల్ డైరెక్టర్ పరిశీలన...**

హాస్టల్‌లో ఆహారం పడక కొంత మంది విద్యార్థులు తీవ్ర అస్వస్థతకు గురైన విషయాన్ని తెలుసుకున్న సోషల్ వేల్ఫేర్ శాఖ రీజనల్ డైరెక్టర్ మేరీ ఏసుపాదం శుక్రవారం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వారిని, హాస్టల్‌లో ఉన్న వారిని పరామర్శించారు. ఇలా ఎందుకు జరిగిందని ఆరా తీశారు.

● **మెనూ ప్రకారం పెడుతున్నాం..**

- సత్యప్రసాద్, ప్రిన్సిపాల్

మెనూ ప్రకారమే హాస్టల్‌లో భోజనం, టిఫిన్‌లు పెడుతున్నాం. ఇందులో భాగంగా గురువారం సాయంత్రం కూడా బోండాలు పెట్టాం. బోండా పిండి కొంచెం పలుచగా రావడం వల్లన నూనె ఎక్కువ పీల్చుకోవడంతో అవి కొందరికి పడకపోయి ఉండవచ్చు. నాకు సమాచారం రాగానే హైదరాబాద్ నుంచి తెల్లవారుజామున సుల్తానాబాద్ వచ్చి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థులను పరామర్శించాను. వారికి మెరుగైన వైద్యం అందేలా చర్యలు తీసుకున్నాం. డిశ్చార్జీ అయి వచ్చిన విద్యార్థులకు డాక్టర్ల సూచనల మేరకు కేవలం పెరుగు అన్నం అందిస్తున్నాం.

ఎంపీగా గెలిస్తే యువతకు ఉద్యోగాలు కల్పిస్తా

- పెద్దపల్లి కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం వంశీ కృష్ణ

పెద్దపల్లి, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): ఎంపీగా గెలిస్తే నియోజకవర్గానికి పరిశ్రమలు తీసుకవచ్చి యువతకు ఉద్యోగాలు కల్పిస్తానని పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి గడ్డం వంశీకృష్ణ అన్నారు. శుక్రవారం ఆయన ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మన్ కుమార్, పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు, చెన్నూరు ఎమ్మెల్యే డాక్టర్ వివేక్, మాజీ ఎమ్మెల్యే నల్లాల ఓదెలు, కుటుంబసభ్యులతో కలిసి రెండు సెట్లలో నామినేషన్ పత్రాలను రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్‌కు అందజేశారు. అనంతరం ఆయన మీడియా పాయింట్ వద్ద విలేకరులతో మాట్లాడుతూ పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గ ప్రజలకు సేవ చేసిన కాకా వెంకటస్వామి నీడలో పెరిగానన్నారు. ఎంపీగా, కేంద్ర మంత్రిగా కాకా సింగరేణి కార్మికుల సమస్యలను పరిష్కరించారన్నారు. పదవీ విరమణ చేసిన తర్వాత పింఛన్ వచ్చేలా కృషి చేశారన్నారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం పెద్దపల్లి ఎంపీగా తన తండ్రి డాక్టర్ వివేక్ పార్లమెంట్‌లో పోరాటం చేశారని గుర్తు చేశారని తెలిపారు. పోరాడి తెచ్చుకున్న తెలంగాణను పదేళ్ల పాటు పాలించిన బీఆర్ఎస్ పార్టీ నాశనం చేసిందని మండిపడ్డారు. కేసీఆర్ ఆయన కుటుంబ సభ్యులు నిరంకుశ పాలనతో అందిన కాడికి దోచుకుని వాళ్ల కడుపు నింపుకున్నారని విమర్శించారు. సహజ వనరులన్నింటిని కొల్లగొట్టి స్థానికులకు ఉపాధి అవకాశాలు లేకుండా చేశారని అన్నారు. మీ ఆశీర్వాదంతో తాను ఎంపీగా గెలిస్తే నియోజకవర్గంలో ఉన్న సహజ వనరులను కాపాడి పరిశ్రమలను తీసుకవచ్చి యువతకు ఉపాధి కల్పిస్తానని హామీ ఇచ్చారు. పది మంది బాగుంటే నేను బాగుంటానని కోరుకునే వ్యక్తి అని, కాంగ్రెస్ ప్రభుత్వం ద్వారానే అభివృద్ధి సాధ్యమని, ఈప్రాంత అభివృద్ధి కోసం విశేషంగా కృషి చేస్తానన్నారు. అంతకు ముందు ప్రభుత్వ విప్ లక్ష్మన్ కుమార్ మాట్లాడుతూ వెంకటస్వామి కేంద్ర మంత్రిగా, ఎంపీగా ఉన్నప్పుడు సింగరేణి కార్మికుల సంక్షేమం కోసం పాటుపడ్డారని ఆ కుటుంబ వారసుడిగా పోటీ చేస్తున్న వంశీకృష్ణను భారీ మెజారిటీతో గెలిపించుకోవాలన్నారు. పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరమణారావుతో పాటు తల స్నానం చేస్తానని తదితరులు పాల్గొన్నారు.



విలేకరులతో మాట్లాడుతున్న కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి గడ్డం వంశీకృష్ణ

కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలపై పోరాటం

- బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి ఈశ్వర్



రోడ్ షోలో మాట్లాడుతున్న కొప్పుల ఈశ్వర్

పెద్దపల్లిటౌన్, ఏప్రిల్ 19 : కాంగ్రెస్ హామీలపై పోరాటం చేస్తామని మాజీ మంత్రి, పెద్దపల్లి బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్ అన్నారు. నామినేషన్ అనంతరం బస్టాండు వద్ద శుక్రవారం నిర్వహించిన రోడ్‌షోలో ఆయన ప్రసంగించారు. బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో సంక్షేమం, అభివృద్ధి జరగగా, 3 నెలల కాంగ్రెస్ పాలనలో రాష్ట్రంలో కరువు విలయతాండవం చేస్తోందన్నారు. తెలంగాణ సాధనలో ఉద్యమించినట్లే ప్రజా సమస్యలు, కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలపై పోరాటం చేస్తామని హెచ్చరించారు. సాగునీరు, 24 గంటల ఉచిత విద్యుత్తు, సంక్షేమ పథకాలు అందించిన ఘనత నాటి సీఎం కేసీఆర్‌కే దక్కిందన్నారు. దేశంలో ఏ రాష్ట్రంలో లేనివిధంగా సంక్షేమం, అభివృ తమ హయాంలో సాధించామని గుర్తు చేశారు. కాంగ్రెస్ రైతు వ్యతిరేక ప్రభుత్వమని విమర్శించారు. సీఎం రేవంత్ రెడ్డి సోయి లేకుండా మాట్లాడడం విడ్డూరమన్నారు. సింగరేణి కార్మికుడిగా ప్రజల కష్టాలు తెలిసిన తనను భారీ మెజారిటీతో గెలిపిస్తే ప్రజా సంక్షేమం కోసం పని చేస్తానని హామీ ఇచ్చారు. పోలీసులను అడ్డం పెట్టుకుని తమ పార్టీ శ్రేణులపై అక్రమ కేసులు బనాయిస్తూ బెదిరింపులకు పాల్పడుతున్నారని కాంగ్రెస్‌పై మండిపడ్డారు. సంక్షేమ రాజ్యం కోసం పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ ను గెలిపించాలని కోరారు. కాంగ్రెస్ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయకుంటే వెంటాడుతామని హెచ్చరించారు. ఆరు గ్యారంటీల అమలుతో పాటు ఇచ్చిన హామీలు అమలు జరగాలని గ్రామాల్లో పోస్టు కార్డు ఉద్యమం చేపట్టాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ అభ్యర్థికి ప్రజల కష్ట సుఖాలు తెలియవని, చుట్టపు చూపులా వచ్చే వారికి ఓట్లేయద్దని ప్రజలను కోరారు. కుబేరుడైన వివేక్ కుటుంబంతో సామాన్యుడైన తాను ఎదురొడ్డి ఎన్నికల్లో పోరాడుతున్నానని, తన గెలుపు ప్రజల గెలుపుకు నాంది కావాలని కోరారు. రోడ్ షోలో జడ్పీ చైర్మన్ పుట్ట మధు, ఎమ్మెల్సీ భాను ప్రసాద్‌రావు, మాజీ ఎమ్మెల్యేలు దాసరి మనోహర్‌రెడ్డి, బాల్క సుమన్, దుర్గం చిన్నయ్య, దివాకర్‌రావు, కోలేటి దామోదర్, గంట రాములు, రఘువీర్ సింగ్, దాసరి ఉష, ఓరుగంటి రమణ రావు, తదితరులు పాల్గొన్నారు.

గీట్ల ముకుందరెడ్డి సేవలు మరువలేనివి

- పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరమణారావు

కాల్వశ్రీరాంపూర్, ఏప్రిల్ 19: మాజీ ఎమ్మెల్యే, దివంగత గీట్ల ముకుందరెడ్డి సేవలు మరువలేనివని ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు అన్నారు. శుక్రవారం మండలంలోని గీట్ల ముకుందరెడ్డి స్వగ్రామమైన కూనారం గ్రామంలో ముకుందరెడ్డి పదవ వర్ధంతి సందర్భంగా ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావుతో పాటు గీట్ల ముకుందరెడ్డి కుమారుడు గీట్ల రాజేందర్‌రెడ్డి, కుటుంబ సభ్యులు, కాంగ్రెస్ నాయకులు, గీట్ల అభిమానులు పాల్గొని ముకుందరెడ్డి ఘాటు వద్ద పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు మాట్లాడుతూ గీట్ల ముకుందరెడ్డి పెద్దపల్లి ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు నియోజకవర్గాన్ని ఎంతో అభివృద్ధి చేశారని గుర్తు చేశారు. కునారం గ్రామ సర్పంచ్‌గా మొదలుపెట్టిన ఆయన రాజకీయ జీవితం సమితి ప్రెసిడెంట్‌గా, మూడుసార్లు పెద్దపెల్లి నియోజకవర్గ ఎమ్మెల్యేగా గెలుపొంది ప్రజలకు సేవలందించారన్నారు. ఒక మహోన్నత వ్యక్తి మన మధ్యలో లేకపోవడం బాధాకరమన్నారు. వారి ఆశయ సాధన కోసం ప్రతి కాంగ్రెస్ పార్టీ నాయకుడు, కార్యకర్త కృషి చేయాలన్నారు. దివంగత ముకుందరెడ్డి బాటలో నడిచి నియోజకవర్గాన్ని అన్ని విధానాల అభివృద్ధి చేస్తానని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో గీట్ల రాజేందర్ రెడ్డి, ఎంపీపీ నూనేటి సంపత్, మాజీ ఎంపీపీ గోపగోని సారయ్యగౌడ్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు గాజనవేన సదయ్య, ఎంపీటీసీ కొల్లూరి రమరాయమల్లు, మాజీ సర్పంచ్ డొంకెన విజయమొగిలి, నాయకులు పులి ఇంద్రకరణ్‌రెడ్డి, తులా మనోహర్‌రావు, మునీర్, కొమరయ్య, సజ్జు, రమేష్, అల్లం సతీష్, గిన రాజు, శివరామకృష్ణ, అశోక్ గౌడ్ పాల్గొన్నారు.



గీట్ల ముకుందరెడ్డి ఘాట్ వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే



కొత్తపల్లిలో ధాన్యం కుప్పలపై రైతులు కప్పిన టార్పాలిన్ కవర్లు

వాతావరణంలో మార్పులు... రైతుల్లో ఆందోళన

పెద్దపల్లి రూరల్, ఏప్రిల్ 19 : రాష్ట్రంలో ఏర్పడ్డ వాతావరణ మార్పులతో రైతులు తీవ్ర అందోళన వ్యక్తం చేస్తున్నారు. బంగాళాఖాతంలో ఏర్పడ్డ అల్పపీడన ద్రోణి కారణంగా రాష్ట్రంలో అక్కడక్కడా మోస్తారు నుంచి భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ అధికారులు ఇప్పటికే పేర్కొన్నారు. దీంతో ధాన్యంను విక్రయించడానికి వేచి ఉన్న రైతుల్లో కలవరం మొదలైంది. కొన్ని రోజులుగా ఉదయం ఎండ తీవ్రత ఎక్కువగా ఉండి సాయంత్రి, రాత్రి వేళల్లో ఒక్కసారిగా వాతావరణంలో మార్పులు వస్తుండటంతో రైతులు అందోళన చెందుతున్నరు. దీంతో రోడ్డు, ఖాళీ ప్రదేశాల్లో అరబెట్టిన ధాన్యం వర్షానికి తడిసిపోతుందని రైతులు టార్పాలిన్‌లు కప్పి రక్షణ కల్పిస్తున్నారు. కేంద్రాలు ప్రారంభం అయిన చోట్ల కొనుగోళ్ల త్వరగా చేపట్టాలని మండలంలోని పలు గ్రామాల రైతులు కోరుతున్నారు. లేకుంటే చేతికి వచ్చిన ధాన్యం అకాల వర్షాలకు నష్టపోవాల్సి వస్తుందని వాపోతున్నారు.

ఘనంగా గ్రాడ్యుయేషన్ డే



సర్టిఫికెట్లతో విద్యార్థులు

కోల్‌సిటీటౌన్, ఏప్రిల్ 19: గోదావరిఖని అడ్డగుంటపల్లిలోని శ్రీరామ విద్యానికేతన్ పాఠశాలలో శుక్రవారం చిన్నారుల గ్రాడ్యుయేషన్ డే కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఎల్‌కేజీ, యూకేజీలో ప్రతిభ చాటి 1వ తరగతికి అర్హత సాధించిన విద్యార్థులకు పాఠశాల కరస్పాండెంట్ ఎస్.వెంకటేశ్వరరావు సర్టిఫికెట్స్ అందజేశారు. అనంతరం జరిగిన విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శన లు విశేషంగా అలరించాయి. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం సూర్యదేవర జ్యోతి, ఉపాధ్యాయులు ప్రశాంతి, తాలియా, గౌతమి, విజయ, పద్మావతి, రాణి, లైలమ్మ, భాగ్యలక్ష్మి, లక్ష్మి, శైలజ, పోషకులు పాల్గొన్నారు.

రామాలయంలో బ్రహ్మోత్సవాల ముగింపు



పట్టు వస్త్రాలను తీసుకెళుతున్న జీఎం దంపతులు

రామగిరి, ఏప్రిల్ 19: మండలం కేంద్రంలోని సెంటినరీకాలనీలోనీ కోదండ రామాలయం, షిర్డిసాయిబాబా ఆలయంలో ఈనెల 15నుంచి జరుగుతున్న సీతారామచంద్రస్వామి కల్యాణ బ్రహోత్సవాలు శుక్రవారం నాగవెల్లి కార్యక్రమంతో ముగిశాయి. శ్రీరామనవిమి సందర్భంగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా ఏర్పాట్లు చేపట్టారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు తావు లేకుండా ఏర్పాట్లను చేశారు. సీతారాముల కళ్యాణంసందర్భంగా ఆర్జీ-3 జీఎం సుధాకర్‌రావు దంపతులు స్వామి వారికి పట్టు వస్త్రాలను సమర్పించగా, పార్లమెంట్ అభ్యర్థి గడ్డం వంశీకృష్ణ అన్నదానం కార్యక్రమాన్ని చేపట్టారు.

గ్రామాల్లో నీటి ఎద్దడి లేకుండా చూడాలి

● జిల్లా పరిషత్ సీఈవో నరేందర్

ముత్తారం, ఏప్రిల్ 19: మండలంలోని అన్ని గ్రామాల్లో నీటి ఎద్దడి లేకుండా చూడాలని జిల్లా పరిషత్ సీఈవో నరేందర్ అన్నారు. మండల కేంద్రంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయాన్ని శుక్రవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మండల పరిషత్ కు వచ్చిన నిధుల రికార్డులను పరిశీలించారు. అనంతరం సిబ్బందితో మాట్లాడుతూ గ్రామాల్లో నీటి ఎద్దడి లేకుండా చూసి ప్రజలకు త్రాగునీరు అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు అలాగే ఇటీవల పంచాయతీరాజ్ నిధులతో చేసిన పనులను పరిశీలించి వాటి నాణ్యతను రికార్డు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో లలిత ఎంపీఓ వేణుమాధవ్ ఐకెపి ఎపిఎం పద్మ పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.



రికార్డులను పరిశీలిస్తున్న సీఈవో నరేందర్

కార్మికుల వేతనాలు చెల్లించాలి

సుభాష్‌నగర్, ఏప్రిల్19: ప్రభుత్వ ఆసుపత్రిలో పనిచేస్తున్న కార్మికుల పెండింగ్ వేతనాలను చెల్లించాలని ప్రభుత్వ హాస్పిటల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ గౌరవ అధ్యక్షుడు బండారి శేఖర్ డిమాండ్ చేశారు. ఈమేరకు శుక్రవారం జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్‌కు వినతి పత్రం అందచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రుల్లో పనిచేస్తున్న శానిటేషన్, పేషంట్ కేర్, సెక్యూరిటి గార్డు కార్మికులకు రెండు నెలలుగా వేతనాలు అందడంలేదని తెలిపారు. ఆసుపత్రి అడ్మినిస్ట్రేటర్ అధికారి కార్మికుల వేతనాలు విడుదలకు కమిషన్ ఆశిస్తున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షుడు అరుణ్, కార్యదర్శి కళావతి, ఉపాధ్యక్షురాలు శారద, రాజు, అంజలి, తదితరులు పాల్గొన్నారు.



సూపరింటెండెంట్‌కు వినతిపత్రం ఇస్తున్న బండారి శేఖర్

'అంబులెన్స్ డ్రైవర్ల ఆగడాలను అరికట్టాలి'

సుభాష్‌నగర్, ఏప్రిల్ 19: కరీంనగర్, మంచిర్యాలలోని ప్రైవేటు హాస్పిటల్స్, అంబులెన్స్ డ్రైవర్ల అగడాలను అరికట్టాలని హ్యూమన్‌రైట్స్ జిల్లా అధ్యక్షుడు మొగిలి సతీస్, జిల్లా కార్యదర్శి చింతపాటి అశోక్ కోరారు. ఈ మేరకు శుక్రవారం కలెక్టర్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారికి వినతిపత్రం అందచేశారు. ఈసందర్భంగా జిల్లా అధ్యక్షుడు మొగిలి సతీష్ మాట్లాడుతూ కమీషన్లకు ఆశపడి పేషంట్ల ప్రాణాలతో చెలగాట మాడుతున్న అంబులెన్స్ డ్రైవర్లు, యజమా నులపై చర్యలు తీసుకోవాలని ఈసందర్భంగా వారు డిమాండ్ చేశారు. మల్టీ స్పెషాలిటి పేరుతో ఆసుపత్రిని ఏర్పాటు చేసి అర్హత లేని వారితో వైద్య అందిస్తున్నారని ఆరోపించారు. ఆర్ఎంపీలు, అంబులెన్స్ డ్రైవర్లు మధ్యవర్తులుగా విచ్చలవిడి వ్యాపారాలు చేస్తున్నారని వారు ఆరోపించారు.

డిప్లొమా కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవాలి

పెద్దపల్లి కల్చరల్, ఏప్రిల్ 19 : మే 18లోపు అర్హత పరీక్ష లేకుండా శ్రీమతి దుర్గాబాయి దేశ్ ముఖ్ ప్రభుత్వ మహిళ టెక్నికల్ శిక్షణా సంస్థలో పాలిటెక్నిక్ డిప్లొమా కోర్సులో ప్రవేశం కోసం అనాథ, నిరుపేద బాలికలు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా సంక్షేమ అధికారి రౌఫ్ ఖాన్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. శ్రీమతి దుర్గాబాయి దేశ్ ముఖ్ ప్రభుత్వ మహిళ టెక్నికల్ శిక్షణా సంస్థ, హైదరాబాద్‌లో పాలిటెక్నిక్ డిప్లొమో కోర్సులకు 2024-25 విద్యా సంవత్సరానికి పదవ తరగతి పూర్తిచేసినటువంటి తల్లిదండ్రులు కోల్పోయిన (అనాథ) బాలికలు, తల్లిగానీ, తండ్రిని కోల్పోయిన బాలికలు(పాక్షిక అనాథ), నిరుపేద బాలికలకు ఎటువంటి అర్హత పరీక్ష లేకుండా నేరుగా పాలి టెక్నిక్ డిప్లొమా కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవాలని, 3 సంవత్సరాల పాటు డిప్లొమా ఇన్ సివిల్ ఇంజనీరింగ్, డిప్లొమా ఇన్ ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీ రింగ్, డిప్లొమా ఇన్ కంప్యూటర్ ఇంజనీరింగ్, డిప్లొమా ఇన్ ఎలక్ట్రానిక్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ కోర్సులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని, ఎంపికైన బాలికలకు ఉచిత విద్య, వసతి కల్పించనున్నట్లు తెలిపారు. వివరాలకు 9032427241 నంబర్‌లో సంప్రదించాలని తెలిపారు.

ఉగాది పురస్కారానికి రాజేష్ ఎంపిక

యైటింక్లయిన్‌కాలనీ, ఏప్రిల్ 19: కాలనీకి చెందిన గుండేటి రాజేష్ అద్వైత ఆర్ట్స్ అకాడమి వారి ఉగాది పురస్కారానికి ఎంపికయ్యాడు. శనివారం హైదరాబాద్ తెలంగాణ సారస్వత పరిషత్‌లో జరగనున్న కార్యక్రమంలో పురస్కారాన్ని అకాడమీ వారు అందజే యనున్నారు. ప్రతి ఏడాది వివిధ రంగాల్లో ఎంపిక చేసిన వారికి అద్వైత ఆర్ట్స్ అకాడమీ ఉగాది పురస్కారాలతో సత్కరిస్తున్నది. గుండేటి రాజేష్‌కు అవార్డు రావడం పట్ల చక్ర పాణి, సాంబారి రాజేష్, కుర్మశ్రీ నివాస్‌లు హర్షం వ్యక్తం చేశారు.

మహాసభను విజయవంతం చేయాలి

రామగిరి, ఏప్రిల్ 19: గోదావరిఖని బృందావన్ గార్డెన్‌లో ఈనెల 21న నిర్వహించే ఐఎన్‌టీయుసీ మహాసభను నాయకులు విజయవంతం చేయాలని ఆర్జీ-3 ఏరియా ఉపాధ్యక్షుడు కొటరవీందర్‌రెడ్డి శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో పేర్కొన్నారు. ఆర్జీ-3 శ్రీపాదభవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఐఎన్‌టీయూసీ జనరల్‌సెక్రెటరీ జనక్‌ప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మహాసభకు ముఖ్యఅతిథులుగా మంత్రి శ్రీధర్‌బాబు హాజరు అవుతున్నట్లు తెలిపారు. ఈ సభకు ఐఎన్‌టీయూసీ శ్రేణులు హాజరుకావలని పిలుపుని చ్చారు. ఈ సమావేశంలో ఐఎన్‌టీయుసీ నాయకులు గడ్డం తిరుపతియాదవ్, సమ్మయ్య, మంగయ్య, పీవీగౌడ్, వెంకట స్వామి, మనోహర్, రాజ్‌కుమార్, జుబేర్, బుచ్చయ్య, సర్వన్ పాల్గొన్నారు.

కొప్పుల నామినేషన్‌కు తరలిన నాయకులు

ఎలిగేడు, ఏప్రిల్ 19:బీఆర్ఎస్ పార్లమెంట్ అభ్యర్థి కొప్పుల నామినేషన్ ప్రక్రియకు మండలంలోని పలు గ్రామాలకు చెందిన బీఆర్ఎస్ మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు పెద్దపల్లికి తరలివెళ్లారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు భైరెడ్డి రాంరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ గోపు విజయ భాస్కర్‌రెడ్డి, తానిపర్తి మోహన్‌రావు, ఆర్‌కె. రాజా, తూడి మురళి, న్యాతరి పోచయ్య, కవ్వంపల్లి బాపయ్య, వినోద్, బాయిని సతీష్, రమేష్‌గౌడ్, రాజేష్, జల్లి రమేష్ ఉన్నారు.

ఉద్యోగ విరమణ కార్మికుడికి సన్మానం

యైటింక్లయిన్‌కాలనీ, ఏప్రిల్ 19: ఉద్యోగ విరమణ పొందిన సింగరేణి గిరిజన సంక్షేమ సంఘం ఉపాధ్యక్షుడు, 15వ డివిజన్ కార్పొరేటర్ బదావత్ శంకర్ నాయక్‌ను అసోసియేషన్ ఆధ్వర్యంలో సన్మానించారు. స్థానిక అసోసియేషన్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఎస్టీ ఉద్యోగుల సంక్షేమ సంఘం వర్కింగ్‌ప్రెసిడెంట్ పంతుల నాయక్, లంబాడా ఐక్యవేదిక అధ్యక్షుడు డాక్టర్ రాజ్‌కుమార్ జాదవ్‌లు పూలమాలలతో శంకర్‌నాయక్‌ను ఘనంగా సన్మానించారు. అసోసియేషన్ ఆర్జీ-2 లైజనింగ్ ఆఫీసర్ బూక్య దేశాయి, సభ్యులు కిషన్ నాయక్, రాజయ్య తదితరులున్నారు.

కార్మిక వ్యతిరేక బీజేపీకి గుణపాఠం చెప్పాలి

యైటింక్లయిన్‌కాలనీ, ఏప్రిల్ 19: కార్మిక, ప్రజా వ్యతిరేక నిర్ణయాలను అవలంబిస్తున్న బీజేపీకి లోక్‌సభ ఎన్నికల్లో గుణపాఠం చెప్పాలని ఇఫ్టూ జాతీయ కార్యదర్శి శ్రీనివాస్ పేర్కొన్నారు. శుక్రవారం ప్రెస్‌భవన్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేట్ పరం చేస్తు, కార్పొరేట్ సంస్థలకు అనుకూలంగా వ్యవహరించిన మోదీని అధికారంలోకి రానివ్వకూడదని అన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం కాంట్రాక్టు కార్మికులను పర్మినెంట్ చేస్తామని హామీ ఇచ్చి నెరవేర్చలేదని అన్నారు. కొత్తగా అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం సింగరేణి కాంట్రాక్టు కార్మికులను పర్మినెంట్ చేయాలని, జీఓ ప్రకారం వేతనాలు చెల్లించాలని శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ఈసమావేశంలో కోడిపుంజుల రాజన్న, ఈ నరేష్, బీ అశోక్, ఏ వెంకన్న, రాజనర్సు, వెంకటస్వామి, శంకర్, పాల్గొన్నారు.

'శ్మశానవాటిక పనుల్లో నాణ్యతాలోపం'

కరీంనగర్ టౌన్, ఏప్రిల్ 19: నగరంలోని పాత బజార్ శివాలయం సమీపంలో గల ముస్లిం శ్మశానవాటికలో నాణ్యత ప్రమాణాలను పాటించకుండా రోడ్లు, ఇతర అభివృద్ధి పనులు చేస్తున్నారని, వాటిని రద్దు చేయాలని హ్యూమన్‌రైట్స్ జిల్లా అధ్యక్షుడు ఎం.సతీష్ మున్సి పల్ కమిషనర్‌కు ఫిర్యాదు చేస్తూ వినతిపత్రం సమర్పించారు. ఇప్పటి వరకు చేసిన పనుల బిల్లులను చెల్లించవద్దని, సంబంధిత కాంట్రాక్టర్‌పై చర్య తీసుకోవాలని ఆయన కోరారు.

రేపు కవనభేరి పుస్తకావిష్కరణ

కరీంనగర్ కల్చరల్, ఏప్రిల్ 19: భవానీ సాహిత్య వేదిక ఆధ్వర్యంలో రచయిత వైరాగ్యం ప్రభాకర్ సంపాదకత్వంలో వెలువడిన కవనభేరి కవితా సంకలనాన్ని వాగీశ్వరి డిగ్రీ కళాశాలలో ఆదివారం ఉదయం 10 గంటలకు నిర్వహిస్తున్నట్లు నూజెట్టి రవీంద్రనాథ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆవిష్కరణకు కవి, శాసన, చారిత్రక పరిశోధకుడు, శ్రీనాథ కవి వంశీకుడు డాక్టర్ కావూరి శ్రీనివాసశర్మ ముఖ్య అతిథిగా హాజరౌతారని పేర్కొన్నారు. అతిథులుగా వేటపాలెం మహాత్మా జ్యోతీబాపూలే గురుకుల విద్యాల ప్రిన్సిపల్ డాక్టర్ సి నారాయణస్వామి, యోగాచార్య సంపత్‌కుమార్, ఆసీఫాబాద్ ఆర్టీసి సూపరెండెంట్ మాడిశెట్టి శ్రీనివాస్ హాజరుకానుండగా భద్రాద్రి కో ఆపరేటివ్ అర్బన్ బ్యాంకు కరీంనగర్ శాఖ మేనేజర్ సవ్యసాచి పుస్తక సమీక్ష చేయనున్నారని తెలిపారు. కవులు, రచయితలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

24 నుంచి అబాకస్ శిక్షణ

పెద్దపల్లి కల్చరల్, ఏప్రిల్ 19: విద్యార్థులు క్యాలిక్యులేటర్ కంటే వేగంగా మెరుపు వేగంతో జమ, తీసివేత, గుణకార, భాగహారాలు ఒకటి నుంచి 100 వరకు మల్టిప్లికేషన్ టేబుల్స్ చదివేందుకు ఆన్‌లైన్‌లో ఈనెల 24నుంచి వారం రోజుల నుంచి ఉచితంగా అబాకస్‌లో శిక్షణ ఇవ్వనున్నట్లు టీచర్ గంగాధర్ ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులలో జ్ఞాపకశక్తి ఏకాగ్రత క్రియేటివ్ థింకింగ్ నైపుణ్యాల అభివృద్ధి కొరకు అబాకస్ ఉచిత శిక్షణ తరగతులు ఎంతగానో ఉపయోగపడుతుందని తెలిపారు. ఇందుకోసం ఒక యాప్‌ను రూపొందించామని గూగుల్ ప్లే స్టోర్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలని ఆయన తెలిపారు.

బొడ్రాయి ప్రతిష్ఠాపన పూజలు

సుల్తానాబాద్, ఏప్రిల్ 19: సుల్తానాబాద్ మున్సిపాలిటీ విలీన గ్రామమైన పూసాలలో శుక్రవారం బొడ్రాయి ప్రతిష్ఠాపన ప్రత్యేక పూజా కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని అన్ని కులాలకు చెందిన వారు ఈ బోడ్రాయి ప్రతిష్టాపన కార్యక్రమంలో పాల్గొన్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ గాజుల లక్ష్మి రాజమల్లు ఈ ప్రతిష్ఠ పూజల్లో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ గుర్రాల మల్లేశం, వల్స నీలయ్య, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ బుర్ర శ్రీనివాస్ గౌడ్, వేగోళం అబ్బయ్య గౌడ్, తిరుపతి రెడ్డి, శ్రీనివాస్ ఉస్తెం రవిందర్, కౌన్సిలర్ గుర్రాల శ్రీనివాస్, పురం రమణ పాల్గొన్నారు. శనివారం పూసాలలో పోచమ్మ తల్లి బోనాల వేడుకలు నిర్వహించనున్నట్టు నిర్వాహకులు తెలిపారు.

బిరుదు రాజమల్లు కుటుంబానికి పరామర్శ

సుల్తానాబాద్, ఏప్రిల్ 19: ఇటీవల అనారోగ్యంతో మృతిచెందిన పెద్దపల్లి మాజీ ఎమ్మెల్యే బిరుదు రాజమల్లు కుటుంబాన్ని వరంగల్ మాజీ ఎంపీ, తెలంగాణ రాష్ట్ర ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ రాజయ్య శుక్రవారం పరామర్శించారు. బిరుదు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన వెంట కాంగ్రెస్ నాయకులు మినుపాల ప్రకాశ్ రావు ఉన్నారు.

ఓటుహక్కుపై అవగాహన సదస్సు



ర్యాలీ నిర్వహిస్తున్న తహసీల్దార్ జాహెద్‌పాషా

కాల్వ శ్రీరాంపూర్, ఏప్రిల్ 19: మండలంలోని చిన్నరాతుపల్లి గ్రామంలో శుక్రవారం ఓటుపై అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో తహసీల్దార్ జాహెద్‌పాషా మాట్లాడుతూ ఓటు హక్కు ఉన్న ప్రతి ఒక్కరూ తమ ఓటును ఉపయోగించుకోవాలన్నారు. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రెవిన్యూ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

'ప్రధాన పార్టీల అభ్యర్థులు ప్రజలకు చేసిందేమీ లేదు'

మంథని, ఏప్రిల్ 19: పెద్దపల్లి పార్లమెంట్ నుంచి పోటీ చేస్తున్న కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ అభ్యర్థులు వంశీకృష్ణ, ఈశ్వర్, శ్రీనివాస్‌లు ప్రజలకు చేసిందేమీ లేదని బూడిద తిరుపతి ఆరోపించారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ తన బీజేపీ మంథని పట్టణ శాఖ అధ్యక్ష పదవికి రాజీనామా చేసినట్లు వెల్లడించారు. ఈపార్లమెంట్ ఎన్నికల్లో పెద్దపల్లి స్థానం నుంచి స్వతంత్ర అభ్యర్థిగా నామినేషన్ వేస్తానన్నారు. కార్యక్రమంలో విరుగురాల ప్రసాద్, మహ్మద్ సర్వర్, భీమనపల్లి సురేందర్, గుడ్ల గురువేష్, ఇర్ల సదానందం, మంథని సాగర్‌లు పాల్గొన్నారు.

కొత్తపల్లి అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్‌గా రాజకుమారి

పెద్దపల్లి రూరల్, ఏప్రిల్ 19: మండలంలోని కొత్తపల్లి జిల్లా పరిషత్ పాఠశాల అమ్మ ఆదర్శ పాఠశాల నూతన చైర్మన్‌గా సబ్బు రాజకుమారిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈసందర్భంగా కాల్వశ్రీరాంపూర్ మాజీ ఎంపీపీ గోపగాని సారయ్యగౌడ్ చైర్మన్ రాజకుమారిని సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సబ్బు సతీష్, కాంగ్రెస్ నాయకులు బాలసాని సతీష్ గౌడ్; ముత్యాల నరేష్, పిట్టల రవి పాల్గొన్నారు.

నియామకం

కమాన్‌పూర్, ఏప్రిల్ 19: ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యులుగా పెద్దపల్లి జిల్లా పెంచికలపేట గ్రామానికి చెందిన ఇరుగాల కిష్టయ్యను నియమిస్తూ జాతీయ ఉపాధ్యక్షులు మామిడిపల్లి బాపయ్య, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బొంకూరి మధులు శుక్రవారం నియామక ఉత్తర్వులు జారీ చేశారు. తన నియామకానికి సహకరించిన జాతీయ, రాష్ట్ర నాయకులు కాంపల్లి సతీష్, కలవల రామచంద్రం, మేడి మహేష్, జేరిపోతుల మహేందర్, సంపత్‌లకు కృతజ్ఞలు తెలిపారు.

'అనుమతి లేని ఇటుక బట్టీలపై చర్యలు తీసుకోవాలి'

కళ్యాణ్‌నగర్, ఏప్రిల్ 19: గోదావరిఖని గోదావరి తీరంలో అక్రమ ఇసుక బట్టీలను ఏర్పాటు చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని ఏఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి మార్కపురి సూర్య జిల్లా కలెక్టర్‌ను కోరారు. మైనింగ్, రెవెన్యూ అధికారుల అనుమతులు లేకుండా ఇటుక బట్టీలను ఏర్పాటు చేసి కట్టెలు, ఉనుక కాల్చడంతో వాతావరణం కలుషితమవుతుందని, రెవెన్యూ, కార్మిక శాఖ అధికారులు చూసి చూడనట్టు వ్యవహరిస్తున్నారని, ఇటుక బట్టీల్లో పని చేస్తున్న కార్మికులకు కనీస సౌకర్యాలు కల్పించడం లేదని, వారికి వైద్యం, పీఎఫ్, ఈఎస్ఐ అందించడం లేదని ఆరోపించారు. అనుమతి లేని ఇటుక బట్టీలపై చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

'నిబంధనలు పాటించని ఇటుక బట్టీల యజమానులు'

పెద్దపల్లి రూరల్, ఏప్రిల్ 19: పెద్దపల్లి నుంచి మంథని వెళ్లే ప్రధాన రహదారికి అనుకొని ఉన్న రాఘవపూర్, రంగాపూర్ గ్రామాల పరిధిలోని ఇటుక బట్టీల్లో రహదారికి ఆనుకొని యాష్ కుప్పలు నిల్వలు చేస్తుండటంతో ప్రమాదాలు జరుగుతున్నాయని శుక్రవారం కార్మిక శాఖ కార్యాలయంలో సీపీఎం ఏరియా కార్యదర్శి సీపెల్లి రవిందర్ ఫిర్యాదు చేశారు. ఈసందర్భంగా రవిందర్ మాట్లాడుతూ యాష్ కుప్పలు రోడ్డు పక్కన నిల్వ చేయడం ద్వారా గాలికి దుమ్ము లేవడంతో రోడ్డుపై వాహనాలు కనిపించని పరిస్థితి ఉందని, దీంతోపాటు ద్విచక్ర వాహనదారులకు దుమ్ము కళ్లలో పడి ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయన్నారు. ఇటుక బట్టీల్లో పనిచేసేందుకు వచ్చిన వలస కార్మికులకు కనీస సౌకర్యాలు కూడా లేవన్నారు. వారితో వెట్టిచాకిరి చేయించడంతో పాటు యజమానులు భౌతిక దాడులకు పాల్పడుతున్నారన్నారు. జిల్లా అధికారులు స్పందించి విచారణ చేపట్టి క్రిమినల్ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. సీపీఎం నాయకులు ఆర్ల సందీప్, సురేష్, ప్రశాంత్ పాల్గొన్నారు.

గురుకులం సీట్లను సాధించిన ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు

కమాన్‌పూర్, ఏప్రిల్ 19: మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న 9మంది విద్యార్థులు శుక్రవారం ప్రకటించిన ఐదో తరగతి గురుకులం ఎంట్రన్స్ ఫలితాల్లో 9 మంది సీట్లను సాధించినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు చొప్పరి తిరుపతి తెలిపారు. విద్యార్థులు గురుకుల సీట్లను సాధించటం పట్ల ఉపాధ్యాయులు మెరుగు రాజమౌళి, కొండ్ల సృజనలను ఎంఈవో సురేంద్రకుమార్ అభినందించారు.

లక్ష్మీనర్సింహస్వామి కల్యాణం



కల్యాణం నిర్వహిస్తున్న పురోహితులు

జూలపల్లి, ఏప్రిల్ 19: మండలంలోని పెద్దాపూర్ గ్రామ శివారులో గల శ్రీయోగానందా లక్ష్మీనర్సింహస్వామి జాతర వేడుకలను పురస్కరించుకుని తిరుకల్యాణ మహోత్సవం వేడుకలను శుక్రవారం ఆలయ నిర్వాహకులు, భక్తజనులు నేత్రపర్వంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ గొట్టిముక్కుల రజని, కాంగ్రెస్ నాయకులు మాజీ సర్పంచ్ గొట్టిముక్కుల రవిందర్‌రెడ్డి పాల్గొన్నారు.